# ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు

రచన : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు



# ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు



రచన & ప్రచురణ : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు


మొదటి ముద్రణ : అక్టోబరు, 2026

ప్రతులు : 1,000

వెల : రూ.70/-



పుస్తకముల కొరకు :-

**తటవర్తి వీరరాఘవరావు,**

తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.

సెల్ : 94901 71853, 9440309812

# తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.70/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) బుద్ధుని పంచశీలాలు | - | రూ.70/- |
| 9) ఆత్మ జ్ఞానం పొందలేకపోవడానికి కారణం? | - | రూ.70/- |
| 10) ఆత్మ పరిణామక్రమం | - | రూ.70/- |
| 11) "అహం దేహోస్మి" నుంచి "అహం బ్రహ్మోస్మి" అనే స్థితికి ఎదగాలి | - | రూ.70/- |
| 12) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.60/- |
| 13) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 14) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 15) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 16) పంచకోశాలు | - | రూ.60/- |
| 17) ధార్మిక జీవితం అంటే? | - | రూ.60/- |
| 18) జీవితం ధన్యం చేసుకోవాలంటే? | - | రూ.60/- |
| 19) జన్మరాహిత్య స్థితికి మార్గం | - | రూ.60/- |
| 20) ఆత్మగా జీవించ లేకపోవడానికి కారణాలు | - | రూ.60/- |
| 21) మాయకు వశమైనవాడి లక్షణాలు | - | రూ.60/- |
| 22) ఆత్మవిశ్వాసం వల్ల కలిగే ఆధ్యాత్మిక లాభాలు ఏమిటి? | - | రూ.60/- |
| 23) దుఃఖానికి కారణం | - | రూ.60/- |
| 24) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 25) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 26) చిత్తం శాంతిగా వుండాలంటే? | - | రూ.50/- |
| 27) విషయ కర్మలు-శ్రేయోకర్మలు | - | రూ.50/- |
| 28) బాహ్య మౌనం - అంతర్ మౌనం | - | రూ.50/- |
| 29) అహంకారం ఎలా పోతుంది | - | రూ.50/- |
| 30) మానవుల్లో అసంతృప్తికి కారణం | - | రూ.50/- |
| 31) ఆధ్యాత్మిక పురోగతికి ప్రధాన శత్రువు-సోమరితనం | - | రూ.50/- |
| 32) భగవంతుని కృప | - | రూ.50/- |
| 33) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |
| 34) జీవితంలో విజయం సాధించాలంటే? | - | రూ.40/- |
| 35) మనస్సు యొక్క స్థితులు | - | రూ.40/- |

# ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు

పత్రి గారు తరచుగా రెండు అత్యంత ముఖ్యమైన విషయాలను చెబుతుండేవారు. అవి: 1. ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు, 2. ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి.

ఈ రెండు వాక్యాల్లోనే ఆధ్యాత్మికత అంతా నిక్షిప్తమై ఉందని ఆయన చెప్పేవారు. అంతేకాదు, ఆయన మరో ముఖ్యమైన విషయాన్ని కూడా చెప్పేవారు. ఆయన సేత్ చాలా గొప్పవాడని చెప్పారు, సేత్ విజ్ఞానాన్ని అంతా వడ పోస్తే వాటి సారం అంతా ఈ రెండు వాక్యాలుగా వస్తాయి అన్నారు.

అందులో ప్రధానమైనవి:

"You Create Your Own Reality" మీ వాస్తవానికి మీరే సృష్టికర్తలు.

"You Must Save Yourself" మిమ్మల్ని మీరే ఉద్ధరించుకోవాలి.

అలాగే పత్రి గారు మరో రెండు సూత్రాలను కూడా చెప్పారు

1. హింసను వదలండి అంటే మాంసాహారాన్ని మానండి.
2. హంసను పట్టుకోండి అంటే "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేయండి.

ఇప్పుడు సేత్ చెప్పిన "ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు" అనే సూత్రాన్ని కొంచెం లోతుగా అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాం.

మీ జీవితంలో జరుగుతున్న ప్రతి అనుభవానికి అది కష్టమైనా, సుఖమైనా, లాభమైనా, నష్టమైనా, అవమానమైనా, ప్రశంస అయినా అసలు కారణం మీరే. సహజంగా ప్రతి మనిషి జీవితంలో ఏదో ఒక రకమైన సమస్య

ఉంటుంది. కానీ చాలామంది తమ కష్టాలకు కారణం ఇతరులేనని భావిస్తారు.

♦ "నా భర్త వల్ల నా జీవితం నరకమైంది" అని కొందరు అనుకుంటారు.

♦ "నా భార్య వల్ల నా జీవితం ఇలా అయిపోయింది" అని మరికొందరు భావిస్తారు.

♦ ఇంకొందరు తమ తల్లిదండ్రులు, అత్తమామలు, పిల్లలు లేదా ఇతర కుటుంబ సభ్యులను కారణంగా చెపుతారు.

తమ జీవితం సరిగా లేకపోవడానికి ఎవరో ఒకరు కారణమని అనుకోవడం సాధారణం. కానీ పూర్ణ జ్ఞానులు చెప్పేది భిన్నంగా ఉంటుంది. "మీ జీవితంలోని కష్టాలకు కారణం ఇతరులు కాదు మీరే అని." ఈ మాట మొదట వినగానే ఆశ్చర్యంగా అనిపిస్తుంది. "నేనే నా జీవితాన్ని కష్టాల్లోకి నెట్టుకుంటానా? నాకేమైనా సరదానా?" అనుకుంటారు.

అయితే ఈ సత్యాన్ని అర్థం చేసుకోవాలంటే మరణానంతర జీవితం మీద అవగాహన ఉండాలి. ఎందుకంటే ఈ సృష్టి కొన్ని సిద్ధాంతాల ఆధారంగా నడుస్తోంది, వాటిలో ముఖ్యమైనవి:

♦ ఆత్మ సిద్ధాంతం.

♦ పునర్జన్మ సిద్ధాంతం.

♦ కర్మ సిద్ధాంతం.

♦ పురోగమన సిద్ధాంతం.

♦ యోగ సిద్ధాంతం.

♦ అనేకానేక సిద్ధాంతం.

ఈ సిద్ధాంతాలపై కొంత అవగాహన వచ్చినప్పుడు జీవితంలోని అనేక ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయి. ఆత్మ సిద్ధాంతం మనకు "నేను ఈ దేహం కాదు, నేను ఆత్మను" అని తెలియజేస్తుంది. సాధారణంగా మనుషులు

నేను దేహాన్ని అని భావిస్తారు. కానీ నిజమైన "నేను" కనిపించని 'ఆత్మ' అని తెలుసుకోవాలి.

ఆ ఆత్మ ఒక్క జన్మతో ఆగిపోదు. అనేక జన్మల ప్రయాణాన్ని కొనసాగిస్తుంది, దీనినే పునర్జన్మ సిద్ధాంతం అంటారు. అయితే ఏ జన్మను పొందాలి అనేది గతంలో చేసిన కర్మలపై ఆధారపడి ఉంటుంది, దీనినే కర్మ సిద్ధాంతం వివరిస్తుంది. కర్మ చేసిన వెంటనే ఫలితం రాదు, కర్మ పండిన తర్వాత మాత్రమే దాని ఫలితం అనుభవంలోకి వస్తుంది.

అంటే:

♦ గతంలో చేసిన కర్మల ఫలితాలను ప్రస్తుతం అనుభవిస్తారు.

♦ ప్రస్తుతం చేస్తున్న కర్మల ఫలితాలను భవిష్యత్తులో అనుభవిస్తారు.

మీ జీవితంలో ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యాలు, కుటుంబ కలహాలు లేదా ఇతర సమస్యలు వచ్చినప్పుడు, అవి కేవలం ఈ జన్మలో జరిగిన సంఘటనల వల్లే వచ్చాయని అనిపించవచ్చు. కానీ కర్మ సిద్ధాంతం ప్రకారం అవి గతంలో చేసిన కర్మల ఫలితాలుగా కూడా వస్తాయి . ఈ అవగాహన లేకపోతే, "నా కష్టాలకు ఇతడే కారణం", "అతడే నా జీవితాన్ని నాశనం చేశాడు", "ఆమె వల్లే నేను బాధపడుతున్నాను" అని ఇతరులను నిందించడం మొదలుపెడతారు.

కానీ ఈ సిద్ధాంతాలపై అవగాహన కలిగినప్పుడు ఒక విషయం స్పష్టంగా అర్థమవుతోంది, ప్రస్తుతం మీరు అనుభవిస్తున్న అనేక పరిస్థితులకు కారణం గతంలో మీరు చేసిన కర్మలే. అందువల్ల "ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు" అనే వాక్యానికి అర్థం ఏమిటంటే ప్రస్తుతం మీ జీవితంలో జరుగుతున్న అనుభవాలకు కారణం మీరే. గతంలో మీరు చేసిన కర్మలే, ఇప్పుడు మీ వాస్తవంగా మీ ముందుకు వచ్చాయి, ఈ అవగాహన వచ్చినప్పుడు ఇతరులను నిందించడం తగ్గుతుంది.

అందుచేత మీ జీవితంలో జరుగుతున్న అనుభవాలకు ఇతరులను కారణంగా చూపాల్సిన అవసరం లేదు. ఈ అవగాహన ఉన్నవారు ఎవరినీ నిందించరు. "నేను చేసిన కర్మల ఫలితాన్నే ఇప్పుడు అనుభవిస్తున్నాను" అనే స్పష్టతతో ఉంటారు. అందువల్ల వారు ఓర్పుతో పరిస్థితులను ఎదుర్కొంటారు, ఎంతకాలం అనుభవించాల్సి ఉంటే అంతకాలం అనుభవిస్తారు. ఆ కర్మ ఫలం పూర్తయిన తర్వాత ఆ కష్టం నుంచి బయటపడతారు.

ఈ అవగాహన కలిగినవారు ఇతరులను తప్పుపట్టడంలో సమయం వృథా చేయరు. బదులుగా ధ్యాన మార్గాన్ని ఆశ్రయించి, మరింత తీవ్రంగా సాధన చేస్తారు. ఎందుకంటే ధ్యానం ద్వారా అపారమైన శక్తిని సంపాదించవచ్చని వారికి తెలుసు.

మీరు కూడా ఇంత దూరం వచ్చి, ఇన్నేసి గంటలపాటు క్రమశిక్షణతో, శ్రద్ధతో ధ్యానం చేస్తున్నారు. మీరు అమూల్యమైన శక్తిని సంపాదిస్తున్నారు. మీ శరీరాన్ని, మనస్సును శక్తివంతంగా తీర్చి దిద్దుకుంటున్నారు.

"శక్తి పెరిగితే ప్రయోజనం ఏమిటి?" అనే సందేహం రావచ్చు. కానీ శక్తి ఉన్నవాడు ఎంతటి కష్టాన్నైనా తట్టుకోగలడు. కష్ట కాలంలో నిలబడగలడు, ఓర్పుతో కర్మ ఫలాన్ని అనుభవిస్తూ చివరకు ఆ పరిస్థితి నుంచి బయటపడగలడు.

అదే శక్తి లేని వ్యక్తి చిన్న సమస్యకే కుంగిపోతాడు, బాధను భరించలేక విలవిల్లాడతాడు, నిరాశకు లోనవుతాడు. కానీ శక్తి పెరిగిన వ్యక్తి కష్టాన్ని మాత్రమే కాదు, తన మనోధైర్యాన్ని కూడా నిలబెట్టుకోగలడు.

అది నా జీవితంలోనే జరిగింది. రెండేళ్ల క్రితం మంచి నీళ్ళు అనుకుని నేను బాత్‌రూమ్ క్లీన్ చేసే యాసిడ్ నోట్లో పోసుకున్నాను. మీలో చాలామందికి తెలిసే ఉంటుంది. హైదరాబాద్‌లోని ఒక పెద్ద హాస్పిటల్‌లో నన్ను చేర్చారు. గొంతు మూసుకుపోయిందని చెప్పి, కడుపుకు ట్యూబ్ అమర్చి

దాని ద్వారా మందులు, లిక్విడ్స్ పంపించారు.

దీని నుంచి పూర్తిగా కోలుకోవడానికి మూడు నుంచి నాలుగు నెలలు పడుతుందని వైద్యులు చెప్పారు. కానీ నేను 20 సంవత్సరాలుగా చేసిన ధ్యాన సాధన వల్ల, సంపాదించుకున్న శక్తి నా శరీరంలో ఉండటం వల్ల, అలాగే ఆ శక్తిని కోల్పోకుండా ఉండాలంటే ఏమి చేయాలనే విషయాలు నాకు తెలిసి వాటిని పాటించడం వల్ల, కేవలం ఒక్క నెలలోనే నేను కోలుకున్నాను, అది చూసి అందరూ ఆశ్చర్యపోయారు.

ఆ శక్తిలో ఎంత గొప్పతనం ఉందో ఒక్కసారి ఆలోచించండి. అందుకే నేను మీ అందరికీ చెప్పేది ఏమిటంటే, ఎలాగైతే ఇక్కడికి వచ్చారో అలాగే ఆ శక్తిని పెంచుకోండి, ఊరికే కాలాన్ని వృథా చేయకండి. మీరు ఎంత సీరియస్‌గా సాధన చేస్తే, మీ శక్తి అంతగా పెరుగుతుంది. దాని వల్ల మీ జీవితంలో అన్ని విధాల లాభాలే కలుగుతాయి.

ఇంకా శక్తి ఎందుకు పెరుగుతుంది అంటే, ఇక్కడ మీరు సరైన ధ్యానం అయిన ఆనాపానసతి ధ్యానం చేస్తూ ఉండటం వల్ల. గైడింగ్ వల్ల కానీ, మ్యూజిక్ వల్ల కానీ, పాటల వల్ల కానీ లేదా ఇలాంటి జ్ఞానాన్ని వినడం వల్ల కానీ శక్తి రాదు. ఎన్ని సంవత్సరాలు చేసినా వాటి వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. కానీ సరైన ధ్యాన సాధన ద్వారా మీరు విలువ కట్టలేని శక్తిని సంపాదించుకుంటారు.

బుద్ధుడు కనుగొన్న, పత్రి గారు మనకు బోధించిన ధ్యానం “శ్వాస మీద ధ్యాస”. ఆయన చాలా స్పష్టంగా చెప్పారు, ధ్యానం అంటే “శ్వాస మీద ధ్యాస” అని. కాని “మ్యూజిక్ మీద ధ్యాస” అని ఆయన ఎక్కడా చెప్పలేదు. ఆయన యజ్ఞాలు చేయించారు, కానీ దానికి కారణాలు వేరుగా ఉన్నాయి. అయితే ధ్యానం గురించి చెప్పేటప్పుడు మాత్రం “శ్వాస మీద ధ్యాస” అనే విషయాన్నే స్పష్టంగా చెప్పారు.

అందువల్ల ఎవరైతే ఆయన చెప్పింది చేస్తారో, వారు తమ జీవితంలో తప్పకుండా లాభం పొందుతారు. ఆయనే స్పష్టంగా చెప్పారు “నేను చేసింది చేయకండి, నేను చెప్పింది చేయండి” అని. ఈ విషయం అర్థమైతే మీరు సరైన ధ్యానం చేస్తారు. అపారమైన శక్తిని సంపాదించుకుంటారు. దేన్నైనా తట్టుకోగలుగుతారు. ఎలాంటి పరిస్థితుల నుంచైనా త్వరగా బయట పడగలుగుతారు.

ఒక విషయం మాత్రం గుర్తుపెట్టుకోండి. చేసిన కర్మ నుంచి ఎవరూ తప్పించుకోలేరు, ఎటువంటి వారైనా సరే అనుభవించాల్సిందే. రామావతారంలో చేసిన కర్మను కృష్ణావతారంలో, యుగాలు మారిన తర్వాత కూడా అనుభవించాల్సి వచ్చింది. ఏ బాణంతో రాముడు వాలిని సంహరించాడో, అదే బాణంతో కృష్ణుడు తన అవతారాన్ని ముగించాల్సి వచ్చింది. దీని ద్వారా మనం అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే, ప్రకృతి నియమాలను ఉల్లంఘించే శక్తి ఎవరికీ లేదు. ఎవరైనా సరే చేసిన కర్మ ఫలితాన్ని అనుభవించాల్సిందే.

మా మేడమ్‌కు కూడా గత జన్మలో చేసిన కర్మల ఫలితమే అనిపించే ఒక సంఘటన జరిగింది. ఒక రోజు ఇంట్లో గ్యాస్ వెలిగిస్తుండగా ఏమి జరిగిందో తెలియదు కానీ, ఒక్కసారిగా మంటలన్నీ ఆమె పైకి వచ్చేశాయి. ఆ వేడికి సిలిండర్ కూడా బయటకు తన్నుబడింది. చిన్న గది కావడం వల్ల మంటలు అక్కడే వ్యాపించాయి. అకస్మాత్తుగా జరిగిన సంఘటన కావడంతో గది తలుపు కూడా సరిగా తెరవలేకపోయాను.

అది తెల్లవారుజామున ఐదు గంటల సమయం. నేను నిద్రలో ఉన్నాను, ఎందుకో ఒక్కసారిగా మెలకువ వచ్చింది. వెంటనే వెళ్ళి బలంగా తలుపు తన్నాను, తలుపు తెరుచుకుంది. అప్పటికే ఆమె చీర మండిపోతోంది. వెంటనే ఆమెను బయటకు లాగాను. కానీ శరీరమంతా మంటలు అంటుకున్నప్పుడు వాటిని ఎలా ఆపగలం? నేను చేతులతో ఆర్పడానికి

ప్రయత్నిస్తే నా చేతులూ కాలిపోయాయి. తర్వాత పక్కనే ఉన్న ఒక దుప్పటి తీసుకొచ్చి కప్పడంతో మంటలు ఆగాయి. అయినప్పటికీ శరీరమంతా కాలిపోయింది.

హాస్పిటల్‌కు తీసుకెళ్తే ఇక్కడ చికిత్స సరిపోదని చెప్పారు. వెంటనే హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. నాలుగు నెలలు ఆమె అనుభవించిన బాధ నరకం లాంటిది. ఒక చిన్న భాగం కాలినా ఎంత బాధ ఉంటుందో మీకు తెలుసు. మరి శరీరమంతా కాలిపోతే ఎంత బాధగా ఉంటుందో ఊహించండి.

ప్రతిరోజూ డ్రెస్సింగ్ చేయడానికి డాక్టర్లు, నర్సులు వచ్చేవారు. కానీ ఆమెకు మాత్రం వారు యమకింకరుల్లా కనిపించేవారట. ఎందుకంటే కాలిన చర్మానికి అంటుకున్న డ్రెస్సింగ్‌ను తీసి, మళ్లీ కొత్తది కట్టాలి. అది తీసే సమయంలో వచ్చే బాధను మాటల్లో చెప్పలేం. ఆ వార్డులో ఎక్కువగా ఫైర్ యాక్సిడెంట్ కేసులే ఉండేవి. దాదాపు ప్రతిరోజూ ఎవరో ఒకరు మరణించిన వారిని తీసుకెళ్తూ ఉండేవారు. ఆ దృశ్యాలన్నీ ఆమె కళ్ళ ముందే జరిగేవి.

ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే? చేసిన కర్మను ఎవరైనా అనుభవించాల్సిందే. "నేను అనుభవించకూడదు" అనుకుంటే ముందుగా అలాంటి కర్మ చేయకూడదు. ఆమెకు జరిగింది ఆమె చేసుకున్న కర్మ ఫలితమే అని భావించవచ్చు. ఎందుకు ఆ సంఘటన అప్పుడే జరిగింది? ఇన్ని సంవత్సరాలు జరగకుండా ఉండి ఆ రోజే ఎందుకు జరిగింది? ఏ జీవికి బాధ కలిగించిందో, ఏ ప్రాణిని హింసించిందో, ఆ కర్మ తన ఫలితాన్ని చూపించింది.

అందుకే ఇప్పుడు అనిపిస్తుంది మాంసాహారం తినకపోతే మంచిదని. తినేటప్పుడు మాత్రం ఎంతో రుచిగా ఉంటుంది. కానీ దాని ఫలితం అనుభవించాల్సి వచ్చినప్పుడు నరకం ఎలా ఉంటుందో తెలుస్తుంది. కొద్దిసేపటి రుచి కోసం తర్వాత అంతులేని బాధ ఎందుకు అనుభవించాలి?

చాలామంది అడుగుతారు, "అయితే కోళ్ళు ఎందుకు పుట్టాయి?" అని. కానీ పాపం చేసేటప్పుడు అలా అనిపిస్తుంది, కాని బుద్ధుడు స్పష్టంగా చెప్పారు **"పాపం చేసేటప్పుడు సుఖ భ్రాంతి ఉంటుంది, కానీ ఆ ఫలితం అనుభవించేటప్పుడు జీవితం కడు దుర్భరంగా ఉంటుంది అని".** అంటే కోడి బిర్యానీ తింటున్నప్పుడు ఎంతో రుచిగా అనిపిస్తుంది, మసాలాల వాసనతో ఆ రుచికి అంతగా అలవాటు పడిపోతారు.

ఒక చిన్న ఉదాహరణ చూడండి. లేత మామిడి కాయను చూసినా, చింతకాయను చూసినా నోట్లో నీళ్లు ఊరుతాయి, ఇది సహజం. కానీ కొందరికి పరిస్థితి ఎలా ఉంటుందంటే, రోడ్డుపై ఒక కోడి కనిపించినా నోట్లో నీళ్ళు ఊరుతాయి. ఇప్పుడు నోట్లో నుంచి ఊరతాయి తర్వాత కంట్లో నుంచి కారతాయి, అంటే తర్వాత అదే కోరికలు జీవితంలో బాధలకు కారణం అవుతాయి.

ఒక వ్యక్తికి కోడి జాయింట్లు అంటే చాలా ఇష్టం అనుకుందాం. రోజూ వెళ్ళి అవే తింటాడు. షాప్ వాడికి కూడా "అవి ఎవరికీ ఇవ్వొద్దు, నేను వస్తాను" అని చెబుతాడు. అంత ఇష్టంగా తినే ఆ జాయింట్లే, తర్వాత ఒక ప్రమాదంలో అతని శరీరంలోని జాయింట్లు విరిగిపోవడానికి కారణమయ్యే కర్మగా మారవచ్చు.

ఒక మోటార్‌సైకిల్ ఢీకొట్టి, దాని మీదుగా కారు వెళ్లి పోయిందనుకోండి. శరీరంలోని జాయింట్లు అన్నీ విరిగిపోతాయి. హాస్పిటల్‌లో చేర్చి కట్లు కట్టి, నాలుగు నెలలు మంచానికే పరిమితం చేస్తారు, కదలలేరు, తిరగలేరు. ఇంట్లో ఐదు నిమిషాలు కూడా ఒకచోట కూర్చోలేని వ్యక్తి, నాలుగు నెలలు మంచం మీదే ఉండాల్సి వస్తే అది ఎంత పెద్ద బాధో ఆలోచించండి.

మీరు నిద్రపోతున్నప్పుడు కూడా ఎన్నిసార్లు అటు ఇటు తిరుగుతారు. కాళ్ళు ముడుచుకుంటారు, చాపుతారు. కానీ కట్లు కట్టి మంచానికే పరిమితం

అయితే ఆ స్వేచ్ఛ కూడా ఉండదు. అప్పుడు ఆ బాధ ఎంత తీవ్రంగా ఉంటుందో అర్థమవుతుంది. అలాగే ఆ వ్యక్తి పరిస్థితి కూడా ఉంటుంది. పాపం, ఇటు తిరగాలని ఉంటుంది. కానీ ఎలా తిరుగుతాడు? కాలు ముడుచుకోవాలని ఉంటుంది. కానీ ఎలా ముడుచుకుంటాడు? చచ్చినట్టు అలా పడుకుని ఉండాల్సిందే. ఒక రోజు కాదు, రెండు రోజులు కాదు, నాలుగు నెలలు. ఆ పరిస్థితి ఒక్కసారి ఊహించండి.

మీరు పడుకున్నప్పుడు కానీ, కూర్చున్నప్పుడు కానీ "దురద వేస్తోంది" అని అంటారు. ఏమాత్రం దురద వచ్చినా ఇటు అటు కదులుతూ ఉంటారు. మరి శరీరానికి ఇన్ని కట్లు వేసిన తర్వాత, లోపల చెమట పట్టి దురద వేస్తే ఎలా ఉంటుంది? వీపు మీద దురద వేస్తే చెయ్యి అందకపోతే ఏమి చేస్తారు? దువ్వెనతోనో, స్కేల్‌తోనో, లేకపోతే గోడకు రుద్దుకుని అయినా గోక్కుంటారు. గోక్కుండా ఉండగలరా? ఉండలేరు.

ఇంత చిన్న దురదను కూడా భరించలేని వారు, కట్టు లోపల దురద వేస్తే ఎలా భరించగలరు? తొడ దగ్గర దురద వేస్తే, కట్టు మీద గోక్కున్నా లోపల దురద పోతుందా? ఆ బాధ ఎంత నరకంగా ఉంటుందో ఆలోచించండి.

కోడికి కాళ్లు, చేతులు కట్టేసి నరికేస్తే అది ఎంత బాధ అనుభవిస్తుందో, అలాగే ఆ వ్యక్తి కూడా తన కర్మ ఫలితాన్ని అనుభవిస్తున్నాడు. గోక్కోవడానికి కూడా వీలు లేకుండా నాలుగు నెలలు నరకం అనుభవించాల్సి వచ్చింది.

నాలుగు నెలల తర్వాత అతను ఏమనుకున్నాడు అంటే, "అమ్మయ్య! ఇక డాక్టర్ గారు కట్లు తీసేస్తారు. నేను మళ్ళీ నడవగలను. మోటార్ సైకిల్ మీద తిరగగలను" అని. డాక్టర్ గారు కట్లు తీసి, "నాలుగు అడుగులు వేయి" అన్నారు. అతను ధైర్యంగా నడవడానికి ప్రయత్నించాడు, కానీ మళ్ళీ ఎముక విరిగిపోయింది, అప్పుడు ఇంకా సరిగ్గా అతుక్కోలేదని తెలిసింది.

అప్పుడు డాక్టర్‌ను తప్పుపట్టడం మొదలుపెట్టాడు. “డాక్టర్ గారు సరిగ్గా కట్టలేదు” అని అనుకున్నాడుఇంకో హాస్పిటల్‌దీతిజిజికు వెళ్లాడు. కానీ సమస్య డాక్టర్‌లో లేదు. ఇంకొకరు అదే చికిత్సతో నడుస్తున్నారు. ఇతను ఎందుకు నడవలేకపోతున్నాడు? కారణం డాక్టర్ కాదు. అతను అనుభవించాల్సిన కర్మ ఫలితం ఇంకా పూర్తికాలేదు.

అందుకే గుర్తుపెట్టుకోండి. కొన్ని ఆపరేషన్లు ఫెయిల్ అవుతున్నాయంటే, డాక్టర్లు ఫెయిల్ అయ్యారని కాదు. కొన్ని సందర్భాల్లో కర్మ ఫలితాన్ని పూర్తిగా అనుభవించాల్సి ఉంటుంది. జీవులకు నరకం చూపిస్తే, మనం కూడా ఏదో రూపంలో నరకాన్ని అనుభవించాల్సి వస్తుంది.

ఇక్కడ ఒక విషయం గుర్తుపెట్టుకోండి. చేసిన వెంటనే కష్టం రాదు. అందుకే చెప్పినా చాలామంది వినరు. ఎన్నో సార్లు చెబుతున్నాం. పత్రి గారు కూడా ఎన్నో సార్లు హెచ్చరించారు. “మీకు కనిపించదు, కానీ మాకు కనిపిస్తుంది. మీరు ఎందుకు అనవసరమైన నరకాన్ని అనుభవించాలి?” అని చెప్పారు.

చాలామంది కోడిని చంపితే అంతే అయిపోయిందని అనుకుంటారు. కానీ కోస్తున్నప్పుడు అది ఎందుకు అరుస్తుంది? అది బతికే ఉంది కాబట్టి అరుస్తుంది. ప్రాణం ఉన్నంత వరకు బాధను అనుభవిస్తుంది. తల నరికి, ప్రాణం పోయిన తర్వాత మాత్రం అరవదు.

ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సిన విషయం ఏమిటంటే, ఆ శరీరంలో కూడా ఒక ఆత్మ ఉంది. మన శరీరం పనిచేస్తోంది అంటే మనలో ఆత్మ ఉంది. ఆత్మ శరీరాన్ని విడిచిపెడితే “చనిపోయాడు” అంటాం. అంటే చనిపోవడం అనేది ఆత్మ శరీరాన్ని విడిచిపెట్టడం. అలాగే కోడి చనిపోయింది అంటే, కోడి శరీరంలోని ఆత్మ కూడా బయటకు వెళ్లిపోయింది.

మీరు కొన్ని సినిమాలు చూసి ఉంటారు. “ఆ నలుగురు” సినిమా

చూసినవారికి గుర్తుండొచ్చు. ఒక వ్యక్తిని బలవంతంగా చంపితే, ఆ వ్యక్తి ఆత్మ కక్షతో తిరుగుతుందని కథల్లో చూపిస్తారు. దానిని మనం దెయ్యం లేదా ప్రేతాత్మ అని పిలుస్తాం. అంటే శరీరాన్ని విడిచిన ఆత్మ, తనకు అన్యాయం చేసిన వారిపై కక్ష తీర్చుకోవాలని ప్రయత్నిస్తుందని ప్రజల నమ్మకం. సినిమాల్లో కూడా అలానే చూపిస్తారు.

నేను చెప్పదలచుకున్న విషయం ఏమిటంటే, మనం ఏ జీవికి బాధ కలిగించినా, ఆ బాధకు సంబంధించిన కర్మ ఫలితం మన దగ్గరకు తిరిగి వస్తుంది. అందుకే ప్రతి ప్రాణిని కరుణతో చూడాలి. ఏ జీవికైనా అనవసరంగా హాని చేయకుండా జీవించడం మంచిది.

కోడి దెయ్యం అంటే కోడి దెయ్యమే, మానవ దెయ్యం అంటే మానవ దెయ్యమే. మరి ఆ కోడి బతుకు ఇలా ఎందుకు అయింది? ఎవరో దానిని చంపేసి తినేశాడు. అది హాయిగా తన పిల్లలతో తిరుగుతున్న దానిని బ్రతకనివ్వకుండా చంపేశాడు, మరి ఆ జీవి పరిస్థితి ఏమిటి?

ఆ శరీరం నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆ ఆత్మపై లోకాలకు వెళ్ళదు, వారి ఇంట్లోనే తిరుగుతుంది.

చాలామంది "మేము ఇంట్లో చంపలేదు, బజార్లో ఎవరో చంపారు. మేము కేవలం మాంసం కొనుక్కొచ్చి వండుకుని తిన్నాం అంతే" అంటారు. కానీ ఆలోచించండి, ఆ జంతువును ఎవరి కోసం చంపాడు? కొనేవారి కోసమే కదా! అందుకే కొన్న వారికి కూడా ఆ కర్మలో భాగం వుంటుంది.

వాడికి నిద్ర పట్టదు. ఆ వైబ్రేషన్స్ అన్నీ తేడాగా మారిపోతాయని కొందరు నమ్ముతారు. ఒక దెయ్యం ఆ ఇంట్లో ఉందని అనుకుందాం. ఈలోపు ఒక మేకను చంపారు అనుకోండి. అప్పుడు మేక దెయ్యం కూడా వచ్చి ఆ ఇంట్లో చేరుతుంది. ఇప్పుడు ఇంట్లో ఒక కోడి దెయ్యం, ఒక మేక దెయ్యం ఉన్నట్టవుతుంది.

ఇలా ఆరు నెలలు, సంవత్సరం గడిచే కొద్దీ మరిన్ని జీవులను చంపుతూ ఉంటే, ఇంట్లో అలాంటి ప్రతికూల శక్తులు పెరుగుతాయి. చివరికి ఆ ఇల్లు మొత్తం అలాంటి ప్రభావాలతో నిండిపోతుంది.

అందుకే కొన్ని ఇళ్లలో నిద్ర సరిగా పట్టదు. అసౌకర్యంగా అనిపిస్తుంది. కొందరు అకస్మాత్తుగా ఉలిక్కిపడి లేస్తారు. చిన్న పిల్లలు కూడా కొన్నిసార్లు కారణం లేకుండానే దడుచుకుంటారు.

ఇలాంటి విషయాలు ముఖ్యంగా మానసికంగా బలహీనంగా ఉన్నవారిపై ఎక్కువ ప్రభావం చూపుతాయని అంటారు. వారి మనస్తత్వం, పరిసరాల ప్రభావం, భయాలు లేదా నమ్మకాల కారణంగా ఇటువంటి అనుభవాలు మరింత తీవ్రంగా అనిపించవచ్చు.

నేను ఒకసారి, దాదాపు 10–12 సంవత్సరాల క్రితం గుంటూరు వెళ్ళాను. అక్కడ ఒక వ్యక్తి “మా ఇంటికి రావాలి, మా ఇంటికి రావాలి” అని చాలా సార్లు ఆహ్వానించాడు. సరే, ఎందుకు అంతగా పిలుస్తున్నాడో చూద్దామని ఒక రోజు రాత్రి ఆయన ఇంటికి వెళ్ళాను.

అప్పటికే బాగా చీకటి పడింది. ఆయన నన్ను చాలా దూరంలో ఉన్న తన ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ నాకు పడుకోవడానికి ఏర్పాటు చేశారు. నేను నిద్రపోవాలని కళ్ళు మూసుకున్నాను. అతను కూడా అదే గదిలో క్రింద పడుకున్నారు.

ఒక గంట, రెండు గంటలు గడిచాయి. అకస్మాత్తుగా అతను కేకలు వేయడం, అరవడం ప్రారంభించాడు. ఏమవుతుందో నాకు అర్థం కాలేదు, ఇక నిద్ర ఎలా పడుతుంది? వెంటనే అతన్ని లేపి, “ఏమిటి ఈ అరుపులు?” అని అడిగాను. అప్పుడు ఆయన, “ఇది మా ఇంట్లో తరచూ జరిగేదే” అని చెప్పాడు. ఆ రాత్రి నాకు సరిగా నిద్ర పట్టలేదు. చాలా ఇబ్బందిగా అనిపించింది.

ఉదయం లేచిన తర్వాత నేను అతన్ని అడిగాను: “ఈ వీధిలో

ఎక్కువగా ఎవరు ఉంటారు?" అని. అతను "ఇక్కడ ఎక్కువగా ముస్లింలే ఉంటారు" అని చెప్పాడు. అప్పుడు నాకు అర్థమైంది. ఆ ప్రాంతంలో ప్రతిరోజూ జంతువుల వధ జరుగుతుండటంతో, ఆ వాతావరణ ప్రభావం ఉండవచ్చని నేను భావించాను.

అందుకే పత్రి గారు కూడా సాధ్యమైనంత వరకు పూర్తిగా శాకాహార కుటుంబాల్లోనే ఉండటానికి ఇష్టపడేవారు. నేను గమనించిన విషయం ఏమిటంటే, భార్యాభర్తలు ఇద్దరూ శాకాహారులైతే అలాంటి ఇళ్ళను ఆయన ఇష్టపడేవారు. కొంత మందికి కొన్ని పరిస్థితులు అలవాటై పోతాయి. కానీ కొత్తగా వెళ్ళిన వారికి ఆ వాతావరణంలోని తేడా స్పష్టంగా తెలుస్తుంది.

ఒక విషయం మాత్రం గుర్తుపెట్టుకోండి. జీవహింస ద్వారా చేసిన కర్మల ఫలితాల నుంచి అంత సులభంగా తప్పించుకోలేరు. అందుకే పత్రి గారు, "మాంసాహారం మానండి, "శ్వాస మీద ధ్యాస"తో ధ్యానం చేయండి" అని బోధించే వారు. ఏది ఏమైనా తాను చేసిన పనికి తానే ఫలితాన్ని అనుభవించాల్సి ఉంటుందని అర్థం చేసుకోవాలి.

అందువల్ల మీ జీవితంలో ఏం జరిగినా, దానికి ప్రధాన కారణం మీరే. వాస్తవానికి ప్రతి వ్యక్తి తన జీవితానికి తానే సృష్టికర్త. ఎవరి జీవితం బాగోలేదో, వారు గతంలో చేసిన కర్మల ఫలితాలను అనుభవిస్తున్నారు. ఎవరి జీవితం బాగుందో, వారు చేసిన మంచి కర్మల ఫలితాలను అనుభవిస్తున్నారు అని తెలుసుకోవాలి. మాంసాహారం తింటూ జీవించడం గొప్ప జీవితం కాదు. సుఖం, శాంతి, ఆనందంతో జీవించడం గొప్ప జీవితం. చాలామందికి ఏమీ కనిపించవు కాబట్టి ఎవరూ లేరని అనిపిస్తుంది. కానీ ఈ సృష్టిని నడిపించే శక్తులు ఉన్నాయి, దేవతలు ఉన్నారు, పూర్ణాత్మలు ఉన్నారు, సృష్టికర్త ఏర్పరచిన నియమాలు, ధర్మాలు, సిద్ధాంతాలు ఉన్నాయి. జీవితం వాటి ప్రకారమే నడుస్తుంది.

దీనిని ఒక ఉదాహరణతో అర్థం చేసుకోవచ్చు. ఒక నగరంలో హెల్మెట్ ధరించడం తప్పనిసరి అనే నియమం ఉందనుకుందాం. “నా ఇష్టం, నేను హెల్మెట్ పెట్టుకోను” అని ఎవరైనా అంటే ఏమవుతుంది? జరిమానా విధిస్తారు. మళ్ళీ అదే తప్పు చేస్తే మరింత ఎక్కువ జరిమానా విధిస్తారు.

అలాగే, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకూడదని చట్టం చెబుతుంది. అందుకే పోలీసులు పరీక్షలు నిర్వహిస్తారు. “నేను తాగి వచ్చాను, ఊదను” అని ఎవరైనా చెప్పినా చట్టం ఊరుకోదు. అలాగే ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించకపోయినా శిక్ష తప్పదు.

మనుషులు రూపొందించిన చట్టాలను పాటించకపోతే ఎలా శిక్షలు పడతాయో! అలాగే ఈ సృష్టిలో కూడా సృష్టికర్త ఏర్పరచిన నియమాలు, ధర్మాలు, సిద్ధాంతాలు ఉన్నాయి, వాటిని పాటించాల్సిందే. “చాలా మందికి అవి తెలియవు”. కానీ వాటిని తెలియజేయడానికే పత్రి గారి వంటి మహనీయులు భూమి పైకి వచ్చి బోధిస్తున్నారు. ఆ బోధనలు పాటించినవారు లాభం పొందుతారు, పాటించనివారు తమ కర్మ ఫలితాలను అనుభవించాల్సి వస్తుంది.

మీరు ఏ ఊరికి వెళ్లినా, ఏ పల్లెటూరికి వెళ్లినా ఒక విషయం గమనించవచ్చు. వృద్ధాప్యంలో ఉన్న చాలామంది అనేక రోగాలు, కష్టాలు, బాధలతో జీవిస్తూ ఉంటారు. దానికి ఒక కారణం యవ్వనంలో చేసిన కర్మలు అని ఆధ్యాత్మికంగా చెబుతారు. కర్మ చేసిన వెంటనే ఫలితం రాదు, అది పండిన తర్వాత ఫలితాన్ని ఇస్తుంది. అందుకే కర్మ చేస్తున్నప్పుడు ఎలాంటి ఇబ్బంది కనిపించదు. ఫలితం వెంటనే రాకపోవడంతో కొందరు ఇంకా ఎక్కువ తప్పులు చేస్తారు.

కొన్ని కర్మలు త్వరగా పండితే త్వరగా ఫలితాలు వస్తాయి. కొన్ని ఆలస్యంగా పండితే వృద్ధాప్యంలో ఫలితాలు అనుభవించాల్సి వస్తుంది. అందుకే

యవ్వనంలో ఉన్నవారికి ఎంత చెప్పినా అర్థం కాదు. ఏమవుతుంది? అని నిర్లక్ష్యం చేస్తారు. కానీ కాలం వచ్చినప్పుడు కర్మ ఫలితాన్ని అనుభవించక తప్పదు.

విచిత్రం ఏమిటంటే, వృద్ధాప్యంలోకి వచ్చేసరికి పని చేసే శక్తి తగ్గిపోతుంది, సంపాదన ఆగిపోతుంది. అప్పుడు ఇంట్లో వాళ్ళ మీద ఆధార పడాల్సి వస్తుంది. వారు ప్రేమగా భోజనం పెడితే తినగలుగుతారు, పెట్టకపోతే ఏమీ చేయలేరు, పూర్తిగా ఇతరులపై ఆధారపడాల్సి వస్తుంది.

అలాంటి సమయంలో కష్టాలు వస్తే ఎంత నరకంగా ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి. ఇప్పుడు మీరు యూట్యూబ్, ఫేస్‌బుక్‌లలో గమనిస్తే వృద్ధాశ్రమాలకు డిమాండ్ బాగా పెరిగింది. వృద్ధాశ్రమాలను బాగా ప్రచారం చేస్తున్నారు. కొన్ని చోట్ల అయితే ఫైవ్ స్టార్ హోటళ్లకు మించిన సౌకర్యాలు ఉన్నాయని చెబుతున్నారు.

దీనిని కూడా ఒక వ్యాపారంగా మార్చుకున్నారు. “మేము సేవ చేస్తున్నాం” అని చెబుతారు. డొనేషన్లు కూడా వస్తుంటాయి. కానీ వాస్తవ పరిస్థితి ఎలా ఉందో అందరికీ తెలుసు.

ఎవరి జీవితమైనా వారు గతంలో చేసుకున్న కర్మను బట్టి ఉంటుంది అంటే వారి వాస్తవాన్ని వారే సృష్టించుకున్నట్టు.

పత్రి గారు ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు, ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి అని చెప్పారు.

ఇంచుమించు ఈ రెండు విషయాలు ప్రపంచంలో సాధారణంగా ఉన్న అవగాహనకు పూర్తిగా విరుద్ధంగా ఉంటాయి. ఎందుకంటే ఎవరికైనా కష్టం వచ్చినా, నష్టం వచ్చినా, దానికి కారణం వేరే ఎవరో అని భావిస్తారు, కానీ దానికి అసలు కారణం మీరే.

ఉదాహరణకు, మీరు ఒక ఫైనాన్స్ కంపెనీలో ఐదు లక్షల

రూపాయలు పెట్టుబడి పెట్టారని అనుకుందాం. ఆ కంపెనీ డబ్బుతో పారిపోయింది, అప్పుడు మీరు ఏమంటారు? “ఆ ఫైనాన్స్ కంపెనీ వాడు నన్ను మోసం చేశాడు” అంటారు. అలాగే చాలా చిట్‌ఫండ్ కంపెనీలు ప్రజల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేసి, తర్వాత కనపడకుండా వెళ్లిపోతారు. అప్పుడు “వాళ్లు చాలా మోసం చేశారు” అని అంటారు.

ఇది మీ కంటికి కనిపించే ప్రత్యక్ష కారణం. కానీ మీరు ఇంతకు ముందు చెప్పుకున్నట్లుగా, కంటికి కనిపించే జీవితం మాత్రమే కాదు, కనిపించని, జరిగిపోయిన జీవితం కూడా ఉంది. దాని గురించి మీరు సాధారణంగా ఆలోచించరు, అంటే, గత జన్మల్లో లేదా అంతకుముందు జన్మల్లో మీరు ఎవరికైనా నష్టం కలిగించి ఉండవచ్చు. ఆ కర్మ ఫలితమే ఇప్పుడు మీకు తిరిగి వచ్చింది. ఇది కంటికి కనిపించదు, కానీ ఆ కర్మ అప్పట్లో చేయక పోయి ఉంటే, ఇప్పుడు ఈ అనుభవం కూడా వచ్చేది కాదు.

ఒక్కసారి గమనించండి, ఆ ఫైనాన్స్ కంపెనీ లేదా చిట్ ఫండ్ కంపెనీ వల్ల కొంత మందికే నష్టం జరిగింది. ఎందుకు? కర్మ సిద్ధాంతం ప్రకారం, గతంలో వారు చేసిన కర్మల ఫలితమే ఇప్పుడు వారి జీవితంలో జరిగింది. అందుచేత వారి వాస్తవానికి వారే కారణం.

కనిపించే కారణాన్ని మాత్రమే చూస్తే, “నా కష్టాలకు ఇతరులే కారణం” అని అనిపిస్తుంది, కానీ కనిపించని పరోక్ష కారణాన్ని అర్థం చేసుకుంటే, “నా పరిస్థితికి నేనే కారణం” అనే సత్యం అర్థమవుతుంది.

చాలామంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు, “భగవంతుడు నాకు అన్యాయం చేశాడు”, “నాకు డబ్బు లేకుండా చేశాడు” అని బాధపడతారు. “వాళ్ళకు సంపద ఇచ్చాడు, నాకు ఇవ్వలేదు” అని అనుకుంటారు. ఇంకొందరు “నన్ను ఎందుకు ఇలాంటి కుటుంబంలో పుట్టించాడు? ధనవంతుల ఇంట్లో పుట్టించి ఉండవచ్చు కదా?” అని ప్రశ్నిస్తారు.

కానీ పరోక్ష కారణాన్ని పరిశీలిస్తే వాస్తవం తెలుస్తుంది. గత జన్మల్లో అధర్మంగా సంపాదించడం, ఇతరులను మోసం చేయడం, అన్యాయంగా ప్రవర్తించడం వంటి కర్మల ఫలితంగా ప్రస్తుత జీవిత పరిస్థితులు ఏర్పడవచ్చు. అలాగే దానం చేసినవారు, సేవ చేసినవారు, ధర్మ బద్ధంగా జీవించినవారు మంచి అవకాశాలు ఉన్న కుటుంబాల్లో జన్మించే అవకాశం పొందుతారని ఆధ్యాత్మిక సిద్ధాంతాలు చెబుతున్నాయి.

అందుచేత ఏ పరిస్థితిని తీసుకున్నా, మీ ప్రస్తుత స్థితికి ప్రధాన కారణం మీరే. అప్పుడు మీరు ఇలా అడగవచ్చు "సరే, ఇప్పుడు మేము ఏమి చేయాలి?" గతంలో జరిగిన దాన్ని మార్చలేరు, గతంలో చేసిన కర్మలను రద్దు చేయలేరు. కానీ ఒక గొప్ప విషయం ఏమిటంటే, ప్రస్తుత వర్తమానం మీ చేతిలో ఉంది. గత కర్మల ఆధారంగా మీ ప్రస్తుత జీవితం రూపొందింది, కానీ ఇప్పుడు మీరు చేసే ఆలోచనలు, నిర్ణయాలు, కర్మలు మీ భవిష్యత్తును నిర్మిస్తాయి.

గతాన్ని మార్చ లేకపోయినా, భవిష్యత్తును మార్చుకునే అవకాశం ప్రతి మనిషికి ఉంది. ఈ క్షణం నుంచే మంచి మార్పు కోసం ప్రయత్నించండి, ఎప్పుడూ మీ జీవితం ఇలాగే ఉండదు. మీరు ఈరోజు చేసే సత్కర్మలే రేపటి మీ సుఖశాంతులకు పునాది అవుతాయి. అంతా మీ చేతుల్లోనే ఉంది. చాలామంది, "ఇప్పుడు నా దగ్గర ఏముంది? నేను ఏమి చేయగలను? ఏమి ఇవ్వగలను?" అని అంటారు, కానీ నిజంగా చేయాలనుకునే వ్యక్తికి ఎన్నో మార్గాలు ఉంటాయి.

అయితే దానికి ముందు మీరు చేయాల్సిన మొదటి పని ఏమిటంటే, మీ బుద్ధిని వికసింపజేసుకోవడం. బుద్ధి ఎంత వికసిస్తే, అంత ఎక్కువగా మీరు ఇతరులకు మంచి చేయగలుగుతారు. మీరు చేసే మంచి భవిష్యత్తులో మీకే లాభం వస్తుంది.

మళ్ళీ కొందరు అడుగుతారు "బుద్ధి ఎలా వికసిస్తుంది?" అని. రెండు పనులు చేయాలి: 1. తీవ్ర ధ్యాన సాధన, 2. సాత్వికమైన శాకాహారం.

కొన్ని నెలల పాటు ఈ రెండు పనులు చేయండి, మీకు తెలియకుండానే మీ బుద్ధి మారిపోతుంది. మీరు చేయకూడదనుకున్నా మంచి పనులు చేస్తారు, ఎన్ని అడ్డంకులు వచ్చినా ముందుకు సాగుతారు. బుద్ధి సరిగా లేకపోతే చిన్న వంక దొరికినా తప్పించుకుంటారు. బుద్ధి వికసిస్తే ఎన్ని ఆటంకాలు వచ్చినా వెనక్కి తగ్గరు. మీరు గమనించండి, ఇక్కడికి వస్తున్న చాలా మంది సాధకులను చూస్తుంటే అర్థమవుతుంది. ఎన్నో ఇబ్బందులు వచ్చినా క్లాసులకు రావడం మానడం లేదు, జూమ్‌లో పాల్గొనడం మానడం లేదు. అంత పట్టుదల ఎందుకు వస్తుంది? బుద్ధి వికసించడం వల్లే. వచ్చే కొద్దీ బుద్ధి పెరుగుతుంది, బుద్ధి పెరిగే కొద్దీ సరైన నిర్ణయాలు తీసుకునే శక్తి వస్తుంది. ఒక విషయం గుర్తుంచుకోండి, నేను మీకు గురువు కాను, మీ వికసించిన బుద్ధే మీకు నిజమైన గురువు.

నేను చెప్పానని మీరు ఇక్కడికి రాలేదు. మీ బుద్ధి నిర్ణయించింది కాబట్టి వచ్చారు. "అక్కడికి వెళ్ళాలి" అనే ఆలోచన మీలో ఎవరు కలిగించారు? మీ అంతరంగమే కలిగించింది. అందుచేత ముందుగా అటువంటి నిర్ణయాలు తీసుకునే బుద్ధిని పెంచుకోవాలి. కొంతకాలం నిరంతరంగా సాధన చేయండి. తర్వాత మీ బుద్ధే మిమ్మల్ని సరైన మార్గంలో నడిపిస్తుంది. మీ భవిష్యత్తు మారాలంటే, మీ జీవితం ఇలా ఉండకూడదంటే, తప్పనిసరిగా బుద్ధి వికసించాలి.

ఇప్పుడు మంచి చేస్తే భవిష్యత్తులో మంచి వస్తుంది, ఇప్పుడు చెడు చేస్తే భవిష్యత్తులో చెడు వస్తుంది, అంతే దీనికంటే పెద్ద రహస్యం ఏమీ లేదు. "మీ వాస్తవానికి మీరే సృష్టికర్తలు". మీ భవిష్యత్తును మార్చుకోవడం కూడా మీ చేతుల్లోనే ఉంది, అందుకే నేను ఎప్పుడూ సాధనకు రండి అని

చెబుతుంటాను. బుద్ధి వికసిస్తే జీవితంలో ప్రతి విషయంలో సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతారు. లేకపోతే భర్తను ఒప్పించలేరు, భార్యను ఒప్పించలేరు, తల్లిదండ్రులను ఒప్పించలేరు, పిల్లలను కూడా ఒప్పించలేరు. జీవితం అయోమయంగా మారుతుంది.

చాలామంది "నా తెలివితేటలు చాలా ఉన్నాయి" అనుకుంటారు. కానీ బుద్ధి వికసించకపోతే ఆ తెలివితేటలు సరైన దిశలో పనిచేయవు. ఈ భీమవరం క్లాసు ఒక గొప్ప అవకాశం, ఇంత సౌకర్యంగా, ఇంత క్రమబద్ధంగా, ఇన్ని గంటల పాటు ధ్యానం చేసే అవకాశం ప్రతి చోటా దొరకదు. అన్ని ఏర్పాట్లు చేసి, ప్రశాంత వాతావరణం కల్పించి, జ్ఞానం అందిస్తున్నప్పుడు దాన్ని ఉపయోగించుకోవాలి.

గతంలో నా జీవితంలో కూడా ఒక దశలో అన్నీ బాగానే జరిగాయి. ఏది పట్టుకున్నా బంగారం అయినట్లుండేది, కానీ ఒక్కసారిగా పరిస్థితులు మారిపోయాయి. ఎందుకు జరిగిందో అప్పుడు అర్థం కాలేదు, ఇప్పుడు అర్థమవుతోంది. అప్పటివరకు సంపాదించుకున్న పుణ్యం ఉన్నంతకాలం అన్నీ బాగానే నడిచాయి. తర్వాత కష్టాలు ప్రారంభమయ్యాయి.

అప్పుడే పత్రి గారు నా జీవితంలోకి వచ్చారు. సేవ చేయమని, ఆత్మ సేవ చేయమని చెప్పారు, కొన్నేళ్ళ పాటు కష్టపడి పనిచేసిన తర్వాత మళ్ళీ పరిస్థితులు మెరుగుపడ్డాయి. అందుకే చెబుతున్నాను ధనం ఇస్తే ధనం వస్తుంది, శాంతి ఇస్తే శాంతి వస్తుంది, ఆనందం ఇస్తే ఆనందం వస్తుంది, జ్ఞానం ఇస్తే జ్ఞానం పెరుగుతుంది. జ్ఞానం పంచుకుంటే జ్ఞానం తగ్గదు, మరింత పెరుగుతుంది.

మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది. కానీ ఆ చేతులు అంటే అర చేతులు కాదు, మీరు చేసే కర్మలే ఆ చేతులు. మంచి చేసే చేతులే మీ భవిష్యత్తును మంచిగా నిర్మిస్తాయి, చెడు చేసే చేతులే కష్టాలను సృష్టిస్తాయి.

అందుకే ఒకటే చెబుతున్నాను శక్తిని పెంచుకోండి, బుద్ధిని వికసింపజేసుకోండి, అనవసరమైన మాటలు, ఆలోచనలు, కాలక్షేపాలను తగ్గించుకోండి.

మీరు ఈ మూడు రోజులు ఇన్ని గంటలు ధ్యాన సాధన చేయడం వల్ల ఖచ్చితంగా శక్తిని పెంచుకుంటారు. కానీ ఆ తర్వాత వచ్చే 27 రోజుల్లో మీరు చేసే పనులను బట్టి, ఈ మూడు రోజుల్లో సంపాదించిన శక్తిలో చాలా భాగాన్ని ఖర్చు చేసేస్తారు. "సాధన చేస్తే శక్తి పెరుగుతుంది, మరి మనం చేసే పనుల వల్ల శక్తి ఖర్చు అవుతుందా?" అని మీరు అడగవచ్చు. అవును, ఖచ్చితంగా అవుతుంది. అందుకే పత్రి గారు, "అనవసరంగా మాట్లాడొద్దు. మీ శక్తిని ఎందుకు ఖర్చు పెట్టుకుంటారు?" అని చెప్పేవారు.

దాని అర్థం ఏమిటంటే, అవసరానికి మాట్లాడడంలో తప్పు లేదు. కానీ ఊరికే, ప్రయోజనం లేని విషయాల గురించి ఎందుకు మాట్లాడాలి? ఇతరులకు అవసరం లేని విషయాలతో కాలక్షేపం ఎందుకు చేయాలి? చాలామంది కలిసి కూర్చుంటే, ఎక్కడెక్కడో జరిగిన విషయాలు, గాసిప్స్, అవసరం లేని వార్తలు మాట్లాడుకుంటూ ఉంటారు. ఒకరు వచ్చి, "ఆ ప్రక్క వీధిలో ఒక అమ్మాయి ఎవరోతో వెళ్ళిపోయిందట" అని చెబుతారు. ఆ విషయం చెప్పి వెళ్ళిపోతారు, కానీ విన్న వ్యక్తి మాత్రం ఆ ఆలోచనలతో తన మనసును పాడుచేసుకుంటాడు.

"ఎందుకు వెళ్ళిపోయింది?", "ఎక్కడికి వెళ్ళి ఉంటుంది?", "దొరికిందా లేదా?" అనే ఆలోచనలు మొదలవుతాయి. అసలు సంబంధం లేని విషయాల్లో మనస్సు ఇరుక్కుపోతుంది. వారు వారి జీవితంలో బాగానే ఉంటారు. కానీ ఆ విషయం విన్న వ్యక్తి మాత్రం తన మనశ్శాంతిని కోల్పోతాడు.

రాత్రి పడుకున్నా అదే ఆలోచనలు గుర్తుకొస్తుంటాయి, నిద్ర కూడా సరిగా పట్టదు. మరుసటి రోజు ఇంకొకరికి ఫోన్ చేసి, "ఆ అమ్మాయి విషయం

ఏమైంది?" అని అడుగుతారు. ఇలా ఆలోచనల ద్వారా, మాటల ద్వారా, చూసే విషయాల ద్వారా, చేసే పనుల ద్వారా మీరు సంపాదించిన శక్తిని క్రమంగా ఖర్చు చేస్తూ ఉంటారు.

అందుకే వీలైనంత వరకు అనవసర విషయాలను తగ్గించుకోవాలి. ఎంత తక్కువగా వాటిలో పాల్గొంటారో, అంత ఎక్కువగా మీ శక్తిని ఆదా చేసుకోగలుగుతారు. అందుకే నేను అవకాశం ఉన్నప్పుడల్లా ధ్యాన శిబిరాలు, సాధన కార్యక్రమాలు, క్లాసులు ఉపయోగించుకోండి అంటాను. మనకు ఎక్కడికక్కడ మూడు రోజుల ధ్యాన శిబిరాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయి. వాటిలో పాల్గొనడం ద్వారా మీ శక్తిని పెంపొందించుకోవచ్చు. ఇక్కడ మీరు ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి, పత్రి గారు చెప్పిన 18 ఆదర్శ సూత్రాలలో 14వ సూత్రం ఏమిటంటే: **"విగ్రహారాధన కాదు, ఆత్మ సత్యారాధన చేయాలి."** అని అన్నారు.

ఎందుకంటే విగ్రహం సత్యం కాదు కానీ, అది ఒక ప్రతిరూపం మాత్రమే. ఆత్మ మాత్రం సత్యం, అందువల్ల ఆశ్రయించవలసింది ప్రతిరూపాన్ని కాదు, సత్యాన్ని. విగ్రహం ఒక రూపం. కానీ ఆత్మ సత్య రూపం. సత్యానికి స్వతంత్రంగా ఒక రూపం ఉండదు. అందుకే మనం సత్యాన్ని ఆశ్రయించాలి. ఆ సత్యాన్ని ఆశ్రయించే మార్గమే పత్రి గారు మనకు బోధించిన "శ్వాస మీద ధ్యాస" అనే ధ్యాన విధానం.

పత్రి గారు మరో విషయం కూడా చెప్పారు: **"నీరు పల్లమెరుగు, సత్యము వ్యాప్తి నెరుగు"** అని సత్యాన్ని నిర్భయంగా, నిర్మొహమాటంగా, ఎటువంటి రాజీ పడకుండా ఆచరించినవారు తప్పకుండా ఎదుగుతారు. పత్రి గారు అలా జీవించారు, అందుకే ఆయన ఎదిగారు. ఆయన చూపిన మార్గంలో నడిచిన వారు ఎదిగారు. మీరు కూడా ఆ మార్గాన్ని అనుసరిస్తే తప్పకుండా ఎదుగుతారు. వేదాలలో కూడా ఒక గొప్ప వాక్యం ఉంది: **"సత్యమేవ జయతే"**

అంటే సత్యమే జయిస్తుంది, 'అసత్యం' చివరికి అపజయాన్ని పొందుతుంది.

కాబట్టి మీ జీవితంలో ఎదగడానికి కావాల్సినవన్నీ మీ చేతుల్లోనే ఉన్నాయి. సత్యాన్ని ఆశ్రయించడం, ధ్యాన సాధన చేయడం, శక్తిని పెంచుకోవడం, అనవసర విషయాలకు దూరంగా ఉండడం. ఇవన్నీ మీ నిర్ణయాల మీదే ఆధారపడి ఉంటాయి.

అందుచేత గుర్తుంచుకోండి, మీ వాస్తవానికి మీరే సృష్టికర్తలు, మీ భవిష్యత్తుకు మీరే నిర్మాతలు, అన్నీ మీ చేతుల్లోనే ఉన్నాయి.

ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు  రెండో ముఖ్యమైన పాయింట్ ఏమిటంటే **"ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి"**.

ఎప్పుడైతే మీ ప్రస్తుత పరిస్థితికి కారణం మీరే అని తెలుసుకుంటారో, అప్పుడు ఎవరినీ నిందించరు, మీరు చేసే పనుల విషయంలో మరింత జాగ్రత్తగా ఉంటారు. మీరు గమనించండి బజారులో ఒక వస్తువు కొనాలంటే ఎన్ని షాపులు తిరుగుతారు? ఎన్ని చోట్ల వివరాలు అడుగుతారు? ఏ షాపులో అసలు వస్తువు దొరుకుతుంది? ఎక్కడ నకిలీ వస్తువు ఉంటుంది? ఎక్కడ ధర తక్కువగా ఉంటుంది? అని ఎంతో పరిశీలిస్తారు, అంత విచారణ చేసిన తర్వాతే కొనుగోలు చేస్తారు. బట్టలు కొనాలన్నా, మరే వస్తువు కొనాలన్నా చాలా ఆలోచిస్తారు.

కానీ ఒకసారి ఆలోచించండి! ప్రతి విషయంలో ఇంతగా ఆలోచించే మీరు, మీ జీవితాన్ని ప్రభావితం చేసే కర్మల గురించి ఎందుకు ఆలోచించరు? మీరు చేసే కర్మల గురించి ఎందుకు విచారించరు? ఇదే ఆశ్చర్యంగా అనిపిస్తుంది.

మీరు చేసే కర్మలే మీ భవిష్యత్తును నిర్మిస్తాయని ఎందుకు తెలుసుకోరు? ఇతర విషయాలన్నింటిలో ఎంతో జాగ్రత్త వహించే మీరు, కర్మల విషయంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యం చేస్తారు? మీరు ఏ పని చేసినా,

ఏ మాట మాట్లాడినా, మీ అంతరంగంలోని ఆత్మ అంటే భగవంతుడు మిమ్మల్ని హెచ్చరిస్తూనే ఉంటుంది. అయినప్పటికీ చాలా సార్లు మీరు ఆ హెచ్చరికను పట్టించుకోరు, మీకు నచ్చినట్లు, మీ ఇష్టానుసారంగా ప్రవర్తిస్తారు, కానీ చేసిన ప్రతి కర్మకు ఫలితం తప్పకుండా వస్తుంది. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే **"ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి".**

లోకంలో ఒక బలమైన నమ్మకం ఉంది, ప్రతి ఒక్కరికీ ఒక ఇష్టదైవం ఉంటాడు. ఆయనే అన్నింటిని చూసుకుంటాడని, ఆయనే జీవితాన్ని మార్చేస్తాడని చాలామంది నమ్ముతారు. ఆయనను ఆరాధిస్తే, ఆయన కృపతో జీవితంలో ఉన్నత స్థితికి చేరుకుంటామని భావిస్తారు. కానీ వాస్తవం ఏమిటంటే, ఎవరూ మిమ్మల్ని ఉద్ధరించలేరు, మిమ్మల్ని మీరు మాత్రమే ఉద్ధరించుకోవాలి.

ఈ సృష్టిని నడిపిస్తున్న పరబ్రహ్మమే మీలో ఆత్మరూపంలో ఉన్నప్పుడు, మిమ్మల్ని మించినవాడు మరెవరు? అలాంటప్పుడు మిమ్మల్ని ఉద్ధరించేది కూడా మీరే కావాలి. అందుకే భగవద్గీతలో శ్రీకృష్ణుడు "ఉద్ధరేదాత్మనాత్మానం" అని చెప్పాడు. అంటే, ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి అని అర్థం.

మీరు ఆత్మస్వరూపులు, మీకంటే గొప్పవాడు మరెవ్వరూ లేరు. మరి అలాంటప్పుడు మిమ్మల్ని వచ్చి ఇంకెవరు రక్షిస్తారు? విచిత్రం ఏమిటంటే, సృష్టి సత్యానికి పూర్తి విరుద్ధంగా మానవుడు జీవిస్తున్నాడు, దానికి కారణం జ్ఞానం లేకపోవడమే.

బుద్ధుడి శిష్యుడైన ఆనందుడు కూడా చాలా కాలం గురువును సేవించాడు. చివరి సమయంలో బుద్ధుడు తనకు ఏదో ప్రత్యేకమైన వరం ఇస్తారని ఆశపడ్డాడు. కానీ బుద్ధుడు ఏమన్నాడంటే: **"అప్పోదీపోభవ" "నీ దీపాన్ని నువ్వే వెలిగించుకోవాలి"** అంటే, నిన్ను నువ్వే రక్షించుకోవాలి, నిన్ను ఇంకెవ్వరూ ఉద్ధరించలేరు. అందుకే పత్రి గారు కూడా చెబుతారు ఆధ్యాత్మికంగా ఎదగాలంటే మీ కృషి మీరే చేయాలి. కొంతమంది "గురువుగారి

అనుగ్రహం ఉంటే చాలు" అని అనుకుంటారు. కానీ గురువు దారి చూపుతాడు కానీ, మీ బదులు సాధన చేయడు, గురువు మిమ్మల్ని ఎత్తుకుని గమ్యానికి తీసుకెళ్ళడు. నడవాల్సింది మీరే, మీరు గురువును పూజించడం, హారతులు ఇవ్వడం, అగరబత్తులు వెలిగించడం కంటే, ఆయన చెప్పిన మార్గంలో నడవడం ముఖ్యం, అదే నిజమైన గురు భక్తి.

ఎంతోమంది గురువులు సాధన చేసి పూర్ణ జ్ఞానులు అయ్యారు, వారి శిష్యులు కూడా తమ కృషితో అదే స్థితికి చేరుకున్నారు. ఈ సృష్టిలో ఇదే క్రమం యుగయుగాలుగా కొనసాగుతోంది. ఎవరైనా గొప్ప స్థాయికి చేరుకున్నారని చూసి ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు, "నా వల్ల కాదు" అని అనుకోవాల్సిన అవసరం లేదు, వారు కృషి చేశారు కాబట్టి సాధించారు. మీరు కూడా అదే స్థాయిలో కృషి చేస్తే, మీకూ సాధ్యమే.

పత్రి గారు చెప్పినట్లుగా "అందరూ ఒక్కటే. ఎవ్వరూ ఎక్కువ కాదు, ఎవ్వరూ తక్కువ కాదు. నేను కొంచెం ముందు ఉన్నాను, మీరు కొంచెం వెనుక ఉన్నారు, అంతే తేడా" అంటారు, అందుకే శ్రద్ధతో సాధన చేయండి. శ్రీకృష్ణుడు కూడా "శ్రద్ధా వాన్ లభతే జ్ఞానం" అని చెప్పాడు అంటే శ్రద్ధ ఉన్నవాడికే జ్ఞానం లభిస్తుంది.

ఇది ఎప్పటికీ మర్చిపోకండి ఈ సృష్టిలో ఎవరూ మిమ్మల్ని కాపాడలేరు, రక్షించలేరు, ఉద్ధరించలేరు, మిమ్మల్ని మీరు మాత్రమే కాపాడుకోవాలి. అయితే ఎలా? పెద్దలు దానికి కూడా సమాధానం చెప్పారు "ధర్మో రక్షతి రక్షిత:" అంటే, మీరు ధర్మాన్ని రక్షిస్తే, ఆ ధర్మమే మిమ్మల్ని రక్షిస్తుంది.

అందుకే ఈ రెండు విషయాలు ఎప్పటికీ గుర్తుంచుకోండి: 1.మీ వాస్తవానికి మీరే కారకులు. 2. మిమ్మల్ని మీరు మాత్రమే ఉద్ధరించుకోవాలి.

# ఆత్మఘోష ఎలా పోతుంది!

మరణానంతరం జరిగే విషయాల గురించి తెలుసుకుందాం. మీరు జీవించి ఉన్నప్పుడే తెలుసుకోవలసిన విషయాలను ఎంత ఎక్కువగా తెలుసుకుంటే, మీ జీవితం అంత సవ్యంగా, సరైన విధంగా సాగుతుంది. ఒక రకంగా చెప్పాలంటే, మీ జీవితంలోని దుఃఖం కూడా తగ్గిపోతుంది.

మరణానంతర జీవితం మరియు ప్రస్తుతం మీరు గడుపుతున్న జీవితం మధ్య ఎంతో దగ్గరి సంబంధం ఉంది. ఆ జీవితం గురించి ఆలోచించకపోవడం, తెలుసుకోక పోవడం వల్లే ఈ సంబంధం మీకు అర్థం కావడం లేదు.

ఎందుకంటే, పైలోకాల్లో మీరు ఎంచుకున్న కర్మలను బట్టే ఇప్పుడు మీ జీవితం నడుస్తోంది. మీ జీవితంలో జరిగే ప్రతి సంఘటనకు కూడా మీరు ఎంచుకున్న కర్మలే కారణం. ఈ రెండింటి మధ్య ఎంతటి సంబంధం ఉందో గమనించండి.

అంతేకాదు, భూమి పైకి వచ్చే ముందు ఆత్మ అయిన మీరు, భూమిపై ఆత్మకు లాభం చేకూర్చే కొన్ని పనులు చేయాలని ముందుగానే నిర్ణయించుకుంటారు. అంటే, ఒక ప్రణాళికను రూపొందించుకుంటారు. నిజానికి, ఆ ప్రణాళిక ప్రకారమే మీరు జీవించాలి.

కానీ భూమి పైకి వచ్చిన తర్వాత, ఆ ప్రణాళిక ఏమిటో పూర్తిగా మర్చిపోతారు. అందువల్ల, మీరు అనుకున్నది ఒకటి, ఇక్కడ మీరు జీవించే విధానం మరొకటి అవుతుంది. పూర్తి భిన్నంగా ఉంటుంది.

పైలోకాల్లో ఉన్నప్పుడు, ఆత్మకు లాభం కలిగించే, ఆత్మ ఉన్నతికి దోహదపడే పనులు చేయాలని నిర్ణయించుకుని వస్తారు. కానీ భూమ్మీదకు వచ్చిన తర్వాత అవన్నీ మర్చిపోయి, “నేను ఆత్మను” అనే సత్యాన్ని కూడా

మరచిపోతారు. కనిపిస్తున్న ఈ దేహమే “నేను” అని భావిస్తూ, దేహం కోసమే జీవిస్తారు. దేహానికి సంబంధించిన లాభాల కోసమే నిరంతరం కృషి చేస్తూ ఉంటారు.

అసలు, “నేను ఒక ప్రణాళిక వేసుకుని భూమి పైకి వచ్చాను” అనే విషయం ఎంతమందికి తెలుసు? ఇంత పెద్ద భూమండలంలో ఏదో పది సెంట్లు, ఇరవై సెంట్లు భూమి కొంటే, ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించినట్లుగా భావిస్తారు. ఒకవేళ ఆ కొనుగోలు చేసిన భూమి ఏదైనా కారణంతో పోతే, జీవితమంతా ఏడుస్తూ కూర్చుంటారు, అదే జీవితమని అనుకుంటారు. “నా జీవితం నాశనమై పోయింది, ఇక నేను ఏమీ చేయలేను.” అని భావించి, ఆత్మను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తారు. కానీ పైలోకాలకు వెళ్ళిన తర్వాత ఆ స్థలం మీతో వస్తుందా? దానిని జేబులో పెట్టుకుని తీసుకెళ్తారా? అంటే తీసుకు వెళ్ళగలిగేవి ఆత్మకు లాభించేవే. కానీ ఆత్మ కోసం మాత్రం ఏమీ చేయరు. చివరికి ఉభయభ్రష్టత్వం చెందుతూ, బాధపడుతూ జీవితాన్ని గడుపుతారు.

ఇలాంటి పరిస్థితి ఎందుకు వస్తుంది? దానికి కారణం ఒక్కటే మరణానంతరం జరిగే విషయాలను తెలుసుకోకపోవడం.

అందుకే పత్రి గారు “వస్తే రానీ, ఉంటే ఉండనీ, పోతే పోనీ” అంటారు. అంటే వచ్చిందని అతిగా సంబరపడకూడదు, ఉందని గర్వపడకూడదు, పోతుందని ఏడుస్తూ కూర్చోకూడదు. ఎందుకంటే, వచ్చే దాని గురించి, పోయే దాని గురించి మీరు ఎందుకు అంతగా ఆలోచించాలి? వచ్చేది అయితే వస్తుంది, రానిది అయితే, మీరు ఎంత ప్రయత్నించినా రాదు. ఉండేది ఉండవలసినంత కాలం ఉంటుంది, పోయేది అయితే, మీరు పట్టుకుని ఆపగలరా? మీరు ఏడిస్తే అది పోకుండా ఉంటుందా? అసలు ఆత్మ అయిన మీరు భూమి పైకి ఎందుకు వచ్చారు?

వచ్చే దాని గురించి, పోయే దాని గురించి ఆలోచించడానికా? లేక

ఆత్మ ఉన్నతి కోసం జీవించడానికా? గుర్తుంచుకోండి. పైలోకాల్లో ఉన్నది ఈ శరీరం కాదు, ఆత్మ అయిన మీరే. అయితే, పైలోకాల్లో ఆత్మ అయిన మీరు ఎలాంటి ప్రణాళిక వేసుకుంటారు? ఒక్కసారి ఆలోచించండి. మీరు ఏ నిర్ణయం తీసుకున్నా, ఏ ప్రణాళిక రూపొందించుకున్నా, అది ఆత్మ లాభం కోసమే ఉంటుంది. ఎందుకంటే అక్కడ దేహమే ఉండదు. అక్కడ మీరు "భూమి పైకి వెళ్ళాక ఇరవై సెంట్ల భూమి కొనాలి" అని ప్రణాళిక వేసుకుంటారా? అలా ఎవరూ అనుకోరు. అప్పుడు మీరు ఏ కుటుంబంలో జన్మిస్తారో, ఎవరి ఇంట పుడతారో, పురుషుడిగా పుడతారో, స్త్రీగా పుడతారో కూడా ఇంకా నిర్ణయించబడలేదు. అయితే అక్కడ మీరు ఏమి నిర్ణయించుకుంటారు?

"భూమి పైకి వెళ్ళిన తర్వాత, నేను ఎంత గొప్ప సాధన చేయాలి. జ్ఞానం సంపాదించాలి. మళ్ళీ పైలోకాలకు వచ్చినప్పుడు మరింత ఉన్నత లోకాలను చేరుకోవాలి." అదే ఆత్మ యొక్క అసలు ప్రణాళిక.

నా విషయంలో కూడా అదే జరిగింది. అది మీకు అర్థమయ్యే విధంగా ఇప్పుడు వివరిస్తాను.

నేను ఒక సంపన్నమైన, గొప్ప కుటుంబంలో జన్మించాను. అయితే, పత్రి గారి పరిచయం కాక ముందు నేను ఆత్మను అనే సత్యం నాకు తెలియదు. అందువల్ల, సంపాదిస్తూ, ఆస్తులు పెంచుకుంటూ, ఏదో గొప్ప పని చేస్తున్నాననే భావంతో జీవించేవాడిని. కానీ నా అంతరంగంలో మాత్రం "ఏదో చేయవలసింది చేయడం లేదు" అనే వెలితి ఎప్పుడూ ఉండేది.

అప్పుడు నేను ఏమనుకున్నానంటే, "పుణ్య కార్యాలు చేయడం లేదు కాబట్టే ఇలా అనిపిస్తుందేమో" అని భావించాను. అందుకే ఎన్నో పుణ్య కార్యాలు చేశాను. మేడమ్ చేత మహిళలకు అనేక చేతివృత్తులు నేర్పించడం జరిగింది. ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాను, అనేక కార్యక్రమాలకు సహకరించాను, విరాళాలు ఇచ్చాను, ఇలా ఎన్నో మంచి పనులు చేశాను.

కానీ ఎన్ని చేసినా, ఎంత చేసినా, నా అంతరంలోని అసంతృప్తి మాత్రం పోయలేదు. ఆ వెలితి అలాగే ఉండేది, అది ఎందుకు ఉందో నాకు అర్థం కాలేదు. ఇంకా ఏమైనా చేయాలేమో అని మాత్రమే అనుకునేవాడిని. అంతకుమించి నాకు ఏమి తెలియదు.

ఆ రోజుల్లో పెద్దలు చెప్పేది రెండు విషయాలే "పాపాలు చేయకండి, పుణ్యాలు చేయండి" అని నేనూ అదే చేశాను. అయినప్పటికీ ఆ వెలితి పోలేదు. ఎందుకంటే, ఆ పాపం పుణ్యం రెండూ కూడా ఆత్మకు ఉపయోగపడవు అనే విషయం నాకు తెలియదు. నేను ఆత్మను అనే అవగాహన కూడా నాకు లేదు. అందువల్ల, నేను చేస్తున్న పనులు ఆత్మకు ఎలా లాభిస్తాయో కూడా తెలియదు. శరీరంలో వున్న ఆత్మ ఒక ప్రణాళికతో వచ్చింది, కానీ ఈ శరీరం చేస్తున్న పనులు మాత్రం పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నాయి. అప్పుడు ఆత్మకు ఎలా తృప్తి కలుగుతుంది?

డబ్బు సంపాదించాను, మంచి సౌకర్యాలు ఏర్పరచుకున్నాను, పిల్లలు కూడా బాగానే ఉన్నారు, అన్నీ ఉన్నట్టే కనిపించాయి. అయినప్పటికీ, లోపల ఏదో వెలితి ఉండేది, అప్పట్లో అది ఎందుకో అర్థం కాలేదు.

ఇప్పుడు మాత్రం స్పష్టంగా అర్థమవుతోంది. ఎన్ని పనులు చేసినా, వాటివల్ల ఆత్మకు ఎలాంటి ప్రయోజనం కలగలేదు. అందుకే ఆత్మ బాధ పడేది. "ఈ పనులన్నీ చేస్తున్నావు, ఇవి నీకు ఏమి ఉపయోగపడతాయి? వీటి గురించి ఎందుకు అంత గొప్పగా భావిస్తున్నావు?" అనే అసంతృప్తి అంతరంలో ఉండేది. అలాంటి సమయంలో పత్రి గారి పరిచయం జరిగింది. నేను చేస్తున్న సేవా కార్యక్రమాలన్నీ ఆయనకు చూపించాను. అప్పుడు ఆయన ముఖంలో కనిపించిన భావం చూసి, "నేను ఇంత గొప్ప పనులు చేస్తున్నానని అనుకుంటుంటే, ఇవన్నీ పెద్ద విలువలేనివే అన్నట్లుగా ఆయన భావిస్తున్నారేమో" అని నాకు అనిపించింది.

ఆ మాట ఆయన అనలేదు, కానీ ఆయన ముఖం చూస్తే నాకు అలా అనిపించింది. అప్పట్లో అర్థం కాలేదు. అంతకుముందు ఇతర గురువులు వస్తే, వారిని సన్మానించేవాడిని, నేను చేస్తున్న సేవా కార్యక్రమాలన్నీ చూపిస్తే, వారు నన్ను ఎంతో ప్రశంసించేవారు. అందుకే పత్రి గారు కూడా నన్ను ప్రశంసిస్తారని అనుకున్నాను.

దాదాపు యాభై సంవత్సరాల పాటు, ఆ అంతరంలో వెలితితోనే జీవించాను. ఎన్ని మంచి పనులు చేసినా, ఆ అసంతృప్తి మాత్రం అలాగే ఉండేది. పత్రి గారి పరిచయం అయిన తర్వాత ఆయన ఒక మాట చెప్పారు.

"మీరు దేహం కాదు, మీరు ఆత్మ" అని ఆ మాటను పూర్తిగా నిర్ధారించుకోవడానికి నాకు కొంత సమయం పట్టింది. ఆయన చెప్పింది నిజమా కాదా అని పరిశీలించాను. చివరకు, ఆయన చెప్పింది సత్యమని అర్థమైంది. అప్పుడు నేను ఆలోచించాను. "యాభై సంవత్సరాలుగా ఇన్ని సంపాదించాను, ఇన్ని ఆస్తులు కూడబెట్టాను, ఇవన్నీ ఆత్మ అయిన నాకు ఏమైనా ఉపయోగపడతాయా?" అని. ఏ మాత్రం ఉపయోగపడవు అని తెలిసింది. అప్పుడు నాకు మరో విషయం అర్థమైంది.

ఆత్మకు నిజంగా లాభ పడేది ఒక్కటే! అదే జ్ఞానం. అది తెలుసుకున్న తర్వాత, ధన సంపాదన ఆపేసి, జ్ఞాన సంపాదనను ప్రారంభించాను. అంతకుముందు చేస్తున్న సేవా కార్యక్రమాలన్నింటినీ నిలిపి వేసి, మూడు రోజుల ఆత్మజ్ఞాన శిక్షణ శిబిరంను ప్రారంభించాను. ఇది దాదాపు 24 సంవత్సరాల క్రితం జరిగిన విషయం.

అప్పుడు నాకు స్పష్టంగా తెలిసింది ఇంతకాలం చేసిన కార్యక్రమాలన్నీ దేహానికి లాభం చేకూర్చేవి. కానీ ఈ ఆత్మజ్ఞాన శిక్షణ మాత్రం ఆత్మకు లాభం చేకూర్చేది అని తెలిసింది. అక్కడితో ఆగకుండా, ఊరూరా తిరుగుతూ ఆత్మజ్ఞానాన్ని బోధించడం కూడా ప్రారంభించాను. ఎప్పుడైతే ఈ పనులు

ప్రారంభించానో, అప్పటి వరకు నా అంతరంలో ఉన్న ఆ వెలితి పూర్తిగా తొలగిపోయింది. అప్పుడు నాకు అసలు సత్యం అర్థమైంది. ఇంతకుముందు ఎన్ని సేవలు చేసినా, ఎన్ని కార్యక్రమాలు నిర్వహించినా, ఎన్ని దానాలు చేసినా, ఆ వెలితి అలాగే ఉండిపోయింది.

కానీ జ్ఞానాన్ని సంపాదించడం, ఆ జ్ఞానాన్ని అందరికీ పంచడం, బోధించడం ప్రారంభించిన తర్వాత మాత్రమే నా ఆత్మ సంపూర్ణ తృప్తిని పొందింది. అంతేకాదు, అంతటితో మాత్రమే ఆత్మ సంతృప్తి చెందదు. ఒకవేళ నేను వారం రోజులు ఇంట్లోనే ఉంటే, మళ్ళీ లోపల ఏదో ఘోష మొదలయ్యేది.

మీరు ప్రతి నెలా ఇక్కడికి వస్తున్నారు, ఏ నెలలోనైనా రాకుండా ఇంట్లోనే ఉండండి. అప్పుడు మీలో ఘోష గమనిస్తే అర్థమవుతుంది.

చూడండి ఎక్కడ శ్రీకాకుళం నుంచి, ఎక్కడ నిజామాబాద్ నుంచి, ఎక్కడ రామగుండం నుంచి, ఎక్కడ కర్ణాటక అన్ని ప్రాంతాల నుంచి కూడా వస్తున్నారు. ఎందుకు వస్తున్నారు? హాయిగా ఇంట్లో భోజనం చేసి, విశ్రాంతిగా నిద్రపోవచ్చు కదా? కానీ అలా చేయలేకపోతున్నారు. ఎందుకంటే లోపల ఉన్న ఆత్మ ఊరుకోదు. ఈ జన్మ శాశ్వతం కాదు, మరొక జన్మ తప్పకుండా ఉంటుంది. ఈ జన్మలో వచ్చిన కష్టాల గురించి ఏడుస్తూ కూర్చోవద్దు. చేయవలసిన సాధనను చేస్తే, మరు జన్మలో ఇటువంటి ఇబ్బందులు లేని జన్మను పొందే అవకాశం ఉంటుంది.

నేను ఇప్పుడు ఎన్నో ఊర్లకు వెళ్తున్నాను. ఎంతోమందిని గమనిస్తున్నాను. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక ఇబ్బంది ఉంది. ఎవరూ పూర్తిగా సమస్యలు లేని జీవితాన్ని గడపడం లేదు. కొంత మందికి ఆర్థిక సమస్యలు ఉన్నాయి, మరి కొందరికి భార్యాభర్తల మధ్య సమస్యలు ఉన్నాయి, ఇంకొందరికి అత్తమామలతో ఇబ్బందులు ఉన్నాయి, మరి కొందరికి పిల్లలతో సమస్యలు ఉన్నాయి. ప్రశాంతంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీవిస్తున్న వ్యక్తి

కనిపించడం లేదు.

మీరు అడగవచ్చు "ఉన్న పరిస్థితుల్లోనే ఆత్మ కోసం కృషి చేస్తే, ఇలాంటి ఇబ్బందులు లేని జీవితం మాకు దొరుకుతుందా? ఆటంకాలు లేకుండా మా సాధన పూర్తి చేసుకోగలమా?" దానికి నా సమాధానం కచ్చితంగా సాధ్యమే. దానికి ఉదాహరణ మేమిద్దరమే, మాకు కూడా ఆరోగ్యపరమైన ఇబ్బందులు వస్తుంటాయి. కానీ అవి మేఘాలు గాలికి చెదిరిపోయినట్లుగా వచ్చి వెళ్ళిపోతుంటాయి. సంసార పరమైన ఇబ్బందులు లేవు, సంపాదన గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. ఈ వయస్సులో కూడా ఊరూరూ తిరుగుతూ జ్ఞానాన్ని బోధించగలుగుతున్నాం, ఇంక జీవితంలో ఏమి కావాలి?

పత్రి గారి పరిచయం అయినప్పుడు మా దగ్గర జ్ఞానం ఏమీ లేదు, వ్యాపారం చేయడం మాత్రమే తెలుసు. ప్రతి సంవత్సరం "ఈ సంవత్సరం ఎంత సంపాదించాను? ఎన్ని కోట్లు పెరిగాయి?" అనే లెక్కలు మాత్రమే వేసుకునే వాడిని. ఇప్పుడు మాత్రం "ఈ సంవత్సరం ఎంత జ్ఞానం పెరిగింది?" అనే లెక్క వేస్తున్నారు. ఇంతకంటే అనుకూలమైన జీవితం ఇంకేముంటుంది? చెప్పండి? ఇది నేను చెప్పేది మాత్రమే కాదు. భగవద్గీతలో కూడా ఇదే విషయం స్పష్టంగా చెప్పబడింది. శ్రీ కృష్ణుడు అర్జునుడికి "యోగి అవ్వు" అని చెప్పాడు. అప్పుడు అర్జునుడు ఇలా అడిగాడు "సరే నువ్వు చెప్పినట్లుగా నేను యోగి కావడానికి ప్రయత్నిస్తాను, కానీ యోగసాధన చేస్తూ మధ్యలోనే ఈ శరీరాన్ని వదిలి పెట్టవలసి వస్తే నా పరిస్థితి ఏమిటి?" అని.

అప్పుడు శ్రీ కృష్ణుడు ఇలా సమాధానం చెప్పాడు, "ఎవరైతే యోగాన్ని అభ్యసిస్తూ, అంటే ఆత్మను ఆశ్రయిస్తూ శరీరాన్ని విడిచిపెడతారో, వారు మరుజన్మలో శ్రీమంతుల గృహంలో గానీ, గొప్ప యోగుల కుటుంబంలో గానీ జన్మిస్తారు. అక్కడి నుంచి తమ సాధనను కొనసాగించి చివరకు మోక్షాన్ని పొందుతారు" అన్నారు. ఆత్మను ఆశ్రయించడమే యోగం. అదే "శ్వాస మీద

ధ్యాస" ధ్యానం. కాబట్టి, ఇప్పుడు మీరు చేస్తున్న సాధన ఏదీ వృథా కాదు, మీకు ఎంత అవకాశం ఉంటే, అంత మేరకు సాధన చేయండి.

ఇంకో ముఖ్యమైన విషయం కూడా చెబుతున్నాను. పత్రి గారు ఎప్పుడూ చెప్పేవారు "ఇంట్లో గొడవలు తెచ్చుకోకండి" అని. చాలామంది సాధన పేరుతో భార్యతో గొడవపడి, భార్యను దూరం చేసుకుంటున్నారు. కొందరు భర్తతో గొడవపడి, భర్తను దూరం చేసుకుంటున్నారు. ఇవన్నీ చేయకండి. ఉన్న పరిస్థితుల్లోనే తీవ్రంగా సాధన చేయండి. మీ సాధన స్థాయి పెరిగిన కొద్దీ ప్రకృతి మీకు సహకరిస్తుంది. క్రమంగా అన్ని పరిస్థితులూ మీకు అనుకూలంగా మారుతాయి, ఇది నేను పూర్తి నమ్మకంతో చెబుతున్నాను.

ఎందుకంటే, ఇది యోగసాధన, యోగసాధన అంటే సృష్టికర్త అయిన పర బ్రహ్మను ఆశ్రయించడం. "శ్వాస మీద ధ్యాస" అంటే, సృష్టికి మూలమైన, సృష్టికి ఆధారమైన పర బ్రహ్మను ఆశ్రయించడం. ఆయన కంటే గొప్పవాడు మరెవరు? అటువంటి పర బ్రహ్మను ఆశ్రయించిన వారికి ఏ లోటు ఉంటుంది?

ఇప్పుడు మీరు గంటల తరబడి ధ్యానంలో కూర్చోగలుగుతున్నారు. కొందరు మూడు గంటలు, కొందరు నాలుగు గంటలు, మరికొందరు ఐదు గంటల పాటు కూడా ధ్యానంలో ఉంటున్నారు. ఇంతకంటే గొప్ప అదృష్టం ఇంకేముంటుంది? దేవాలయాలకు తిరుగుతూ, ఈ క్షేత్రం, ఆ క్షేత్రం అంటూ తిరుగుతుంటే, మీలోనే ఉన్న దైవాన్ని ఎప్పుడు తెలుసుకోగలరు? శివుడు ఎక్కడో బయట ఉన్నాడని అనుకుంటారు.

కానీ నిజానికి తెలుసుకోవలసింది మీలోనే ఉన్న శివుడిని. పూర్వం నుంచి వస్తున్న ఆచారాల వల్ల పూజలు, విగ్రహారాధనలు మాత్రమే సరైన మార్గమని చాలామంది భావిస్తున్నారు. కానీ ఆత్మ సాక్షాత్కారానికి ధ్యానం మరియు ఆత్మ జ్ఞానమే చూద్దాం.

# మన కళ్ళకు కనిపించేది నలుసంత, మన కళ్ళకు కనిపించనిది కొండంత

వాస్తవానికి, జీవించి ఉన్నప్పుడు మనకు తెలిసేది చాలా స్వల్పం మాత్రమే. కానీ మరణించిన తర్వాత మనం తెలుసుకునే విషయాలు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. అప్పుడు, “అరే! తెలుసుకోవాల్సిన విషయాలు ఇంకా ఎన్ని ఉన్నాయో!” అని అనిపిస్తుంది. అలాంటి విషయాలనే ఇప్పుడు తెలుసుకుంటున్నారు.

ఇప్పుడు చర్చించబోయే విషయం ఏమిటంటే **“మన కళ్ళకు కనిపించేది నలుసంత, మన కళ్ళకు కనిపించనిది కొండంత”** ప్రస్తుతం మీరు జీవిస్తున్న విధానం ఎలా ఉందంటే, ఈ నలుసంత తెలిసిన దానికి అనుగుణంగా జీవిస్తున్నారు. కానీ నిజానికి మీరు తెలుసుకోవలసింది కొండంత ఉంది. దానిని తెలుసుకొని, దానికి అనుగుణంగా జీవించగలిగితేనే మీరు సరైన విధంగా జీవించినవారవుతారు. అంతేకాకుండా, జీవిత లక్ష్యాన్ని కూడా సాధిస్తారు.

మీరు గమనించండి. కొన్నిసార్లు మీ పిల్లల వల్ల కావచ్చు, స్నేహితుల వల్ల కావచ్చు, లేదా మరెవరి వల్ల అయినా కొత్త విషయాలు నేర్చుకుంటారు. అప్పుడు, “అరే! నాకు ఇది ఇంతకుముందు తెలియదే!” అని అంటుంటారు. అందుకే పత్రి గారు "Enlightenment" అనే చిన్న పుస్తకం వ్రాశారు. ఆ పుస్తకంలో ఆయన ఒక ముఖ్యమైన విషయం చెప్పారు. “ఎన్ని విషయాలు తెలుసుకున్నా, నేను తెలుసుకోవలసినవి ఇంకా ఉంటూనే ఉంటాయి” అని తెలుసుకున్నవాడే నిజమైన "Enlighted Master."

మీకు కొన్ని తెలుసు, కానీ “నాకు అన్నీ తెలుసు” అని ఎప్పుడూ అనుకోకూడదు, అలాంటి భావన మూర్ఖుని లక్షణం. ఎందుకంటే, మీరు

ఎంత తెలుసుకున్నా ఈ సృష్టిలో తెలుసుకోవలసిన విషయాలు ఇంకా ఎన్నో ఉంటూనే ఉంటాయి, ఎంత నేర్చుకున్నా, ఇంకా నేర్చుకోవాల్సింది ఉంటుంది. మీరు ఈ భావంతో ఉన్నట్లయితే, మీరు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటారు, అలాగే ఎంతో గొప్పవారిగా ఎదుగుతారు.

అందుకే పత్రి గారు పరమ శివుని ఉదాహరణను చెబుతుంటారు. శివుడు ఎప్పుడూ ధ్యాన స్థితిలోనే ఉంటాడు, ఆయన నిరంతరం ధ్యానం చేస్తూనే ఉంటాడు.

కారణం ఈ సృష్టిలో తెలుసుకోవలసిన విషయాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. వాటిని తెలుసుకోవడానికే నేను ఈ ధ్యానం చేస్తున్నాను." అని శివుడు చెప్పారట.

దీనిని బట్టి మీరు ఎన్ని తెలుసుకున్నా, ఇంకా తెలుసుకోవాల్సింది ఎంతో ఉందనే విషయాన్ని ఎప్పుడూ మర్చిపోకూడదు. అలా ఉంటే మీలో అహంకారం పెరగదు. పైగా, మీరు ఇంకా ఇంకా జ్ఞాన వంతులు అవుతారు. లేకపోతే, తెలిసిన కొద్దిపాటి అల్ప జ్ఞానానికే మనిషి పతనమై పోతాడు. కొద్దిగా ఏదైనా వచ్చిందనుకున్న వెంటనే అహంకారం పెరిగిపోతుంది. "నాకు వచ్చు, ప్రక్కవాడికి రాదు" అనే భావం వస్తుంది. కానీ, మీకు వచ్చిన దాని కంటే ఎక్కువ తెలిసినవారు ఎంతమంది ఉన్నారో ఆలోచించరు. "వాడికి రాదు, నాకు వచ్చు" అనే భావంలోనే ఉంటారు.

అందుకే చాలామంది ఎదగలేక పోతున్నారు. నేను మన సమాజంలో ఎంతోమందిని గమనిస్తున్నాను, చాలామంది చాలా చిన్నచిన్న విషయాలు నేర్చుకుంటూ, జీవితాంతం అక్కడే ఉండిపోతారు. కానీ తాము చాలా గొప్ప వాళ్ళమని అనుకుంటారు, తాము ఎదుగుతున్నామని భావిస్తారు. వాస్తవానికి, అక్కడే ఆగిపోయామని వారికి అర్థం కాదు.

అందుకే పత్రి గారు, "అందరి దగ్గర నుంచి నేర్చుకోవాలి, అందరి పుస్తకాలు చదవాలి." అని చెప్పేవారు. అందుకే నేను అందరి అనుభవాలు వినడానికి ఆసక్తి చూపిస్తాను అని కూడా చెప్పేవారు. నేను ఆయనను దగ్గరగా గమనించాను. క్రొత్తవాళ్లు ఎవరైనా వచ్చినప్పుడు, లేదా ఎవరినైనా కలిసినప్పుడు, "చెప్పండి." అని అడిగేవారు.

అప్పుడు చాలామంది, "మీరే చెప్పాలి సార్" అని అనేవారు. వారిని చూసి వెంటనే ఆయనకు అర్థమైపోయేది. అలాంటి వ్యక్తితో ఎక్కువసేపు మాట్లాడాల్సిన అవసరం లేదని భావించి, వారిని పంపించేసేవారు. కానీ, ఎవరైనా తమ అనుభవాలు చెప్పడం ప్రారంభిస్తే, పూర్తిగా చెప్పకముందే ఆయనకు అర్థమైపోయేది. "ఈ వ్యక్తి దగ్గర నేను కొత్తగా తెలుసుకోవాల్సిన విషయం ఏదీ లేదు." అని గ్రహించిన వెంటనే, ఆ సంభాషణను ముగించి ఇంకొకరితో మాట్లాడడం ప్రారంభించేవారు. అప్పుడు నాకు ఒక విషయం స్పష్టంగా అర్థమైంది. "అందరి దగ్గర నుంచి నేర్చుకోవాలి" అంటే, ఎవరి దగ్గరైనా తెలియని కొత్త విషయం ఉంటే దానిని నేర్చుకోవాలి అనే అర్థం.

అంతేకానీ, మీకు ఇప్పటికే తెలిసిన విషయాలనే మళ్ళీ మళ్ళీ చెప్పే వారి దగ్గర జీవితాంతం కూర్చొని కాలక్షేపం చేస్తే, వారికంటే మూర్ఖుడు మరొకరు ఉండరు. అలాంటి వారు ఒక అమూల్యమైన మానవ జన్మను వృథా చేసుకున్నట్టే. "అందరి దగ్గర నేర్చుకోవాలి" అనే మాటలోని అసలు అర్థం చాలామందికి తెలియదు. "అన్ని పుస్తకాలు చదవమన్నారు కదా. అందుకే అన్నీ చదువుతున్నాను. అందరినీ వినమన్నారు కదా! అందుకే అందరినీ వింటున్నాను." అని అనుకుంటారు. కానీ, ఆ మాటలోని అంతరార్థం వారికి తెలియదు.

మీ బుద్ధి కొంచెం ఆలోచిస్తే, "అందరి దగ్గర" అనే మాటలోని

నిజమైన భావం మీకు అర్థమవుతుంది. మీరు ఇక్కడికి వచ్చినదే ఇలాంటి సూక్ష్మ విషయాలు నేర్చుకోవడానికే. అందుకే పత్రిగారు "Five Fingers Concept" గురించి వివరించేవారు. దానిని మీరు తప్పకుండా గుర్తుంచుకోండి.

ఆయన ఐదు వేళ్ళను చూపిస్తూ ఇలా చెప్పేవారు

- ♦ చిటికెన వేలు శరీరం
- ♦ ఉంగరపు వేలు మనసు
- ♦ మధ్య వేలు బుద్ధి
- ♦ చూపుడు వేలు ఆత్మ
- ♦ బొటన వేలు సర్వాత్మ

దీనిని బట్టి మీకు ఏమి అర్థమవుతుంది?

- ♦ శరీరం కంటే మనసు గొప్పది.
- ♦ మనసు కంటే బుద్ధి గొప్పది.
- ♦ బుద్ధి కంటే ఆత్మ గొప్పది.
- ♦ ఆత్మ కంటే సర్వాత్మ గొప్పది.

ఈ క్రమాన్ని మీరు ఎప్పటికీ మర్చిపోకండి, ఎప్పుడూ గుర్తుంచుకోండి

ఈ ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చిన వారిలో, అంటే మన సొసైటీలో ఎంతోమంది మాస్టర్లు ఉన్నారు, వారందరూ పిరమిడ్ మాస్టర్లే. పైకి చూస్తే అందరూ మాస్టర్లే, ఎందుకంటే, బోధించే వారిని మాస్టర్లు అంటారు. కానీ, ఈ బోధించే మాస్టర్లలో కూడా స్థాయిలు ఉంటాయి.

కొంతమంది దేహ స్థితిలో ఉంటారు, కొంతమంది మనోస్థితిలో ఉంటారు, కొంతమంది బుద్ధి స్థితిలో ఉంటారు, కొంతమంది ఆత్మ స్థితిలో ఉంటారు, సర్వాత్మ స్థితిలో ఉన్నవారు మాత్రం వేళ్ళ మీద లెక్కపెట్టగలిగేంత అరుదుగా ఉంటారు.

దేహ స్థితిలో ఉన్న మాస్టర్లు శరీరం గురించి, శరీరానికి కలిగే ప్రయోజనాల గురించి చాలా బాగా చెప్పగలుగుతారు. గుర్తుంచుకోండి వారందరూ ధ్యానం గురించే చెబుతారు. కానీ, దేహ స్థితిలో ఉన్న మాస్టర్లు ధ్యానం వల్ల శరీరానికి కలిగే ప్రయోజనాలపైనే ఎక్కువగా దృష్టి పెడతారు. వారు, "ధ్యానం చేయండి,మీ రోగాలు తగ్గిపోతాయి, మీరు ఉత్సాహంగా పని చేసుకోగలుగుతారు" అని ప్రధానంగా ఈ విషయాలనే వివరిస్తారు.

అలాగే, కొంతమంది మాస్టర్లు ఆస్ట్రల్ సర్జరీ గురించి చెబుతారు. వారు ఏమంటారంటే, "మీరు ధ్యానం చేస్తే, మీకు తెలియకుండానే మాస్టర్లు మీ శరీరానికి ఆపరేషన్ చేసి, మీ రోగాన్ని తగ్గిస్తారు." అని వివరిస్తారు. తరువాత, "మీకు ఆస్ట్రల్ సర్జరీ జరిగింది." అని చెబుతారు.ఇది దేనికి సంబంధించిన లాభం? ఇది పూర్తిగా శరీరానికి సంబంధించిన లాభం అని మీరు గుర్తుంచుకోవాలి.

ఇంకా కొంతమంది స్పిరిట్యువల్ టాబ్లెట్స్ గురించి మాట్లాడుతారు. ఒక్కసారి ఆలోచించండి టాబ్లెట్లు దేని కోసం వాడతారు? రోగాల కోసమే కదా! రోగాలు దేనికి సంబంధించినవి? శరీరానికి సంబంధించినవే. అంటే, ఈ మాస్టర్లు ప్రధానంగా శరీర స్థాయిలో ఉన్నవారు. వారు శరీరానికి సంబంధించిన విషయాల్లో నిపుణులు కావచ్చు. వారు ముప్పై సంవత్సరాలుగా సాధన చేస్తూ ఉంటే, వారిని సీనియర్ మాస్టర్లు అని పిలవవచ్చు.

కానీ, ఆ సీనియారిటీ దేనిలో? శరీరానికి సంబంధించిన విషయాల్లో, రోగాల గురించి ఉన్న అనుభవంలోనే. ఈ సూక్ష్మమైన అంశం మీకు అర్థమవుతే మీరు గొప్పవారే. ఈ విషయం మీలో చాలామందికి ఇంకా పూర్తిగా అర్థం కాలేదు, "సీనియర్ మాస్టర్" అనే పదానికి కూడా సరైన అర్థం తెలియదు. చాలామంది, సీనియర్ మాస్టర్ అంటే అందరికంటే గొప్ప మాస్టర్ అని

భావిస్తారు. కానీ అది సరైన అవగాహన కాదు.

మీకు ఇంకా స్పష్టంగా అర్థమయ్యేలా ఒక ఉదాహరణ చెబుతాను. ఎలిమెంటరీ పాఠాలు బోధించే ఉపాధ్యాయులు ఉంటారు కదా? అలాగే, శరీర స్థితిలో ఉన్న మాస్టర్లు కూడా శరీరానికి సంబంధించిన లాభాలనే ప్రధానంగా బోధిస్తారు. ఆధ్యాత్మిక పరంగా చూస్తే వీరిని ఎలిమెంటరీ మాస్టర్లు అని చెప్పవచ్చు.

ఆధ్యాత్మిక దృష్టిలో శరీరం అనేది ఎలిమెంటరీ స్థాయి మాత్రమే. దాని ప్రాముఖ్యం కూడా అంతవరకే. శరీరానికి సంబంధించిన విషయాలన్నీ ఆధ్యాత్మికంలో ఎలిమెంటరీ నాలెడ్జ్ కిందకు వస్తాయి. ఇప్పటికే ఈ విషయం మీకు కొంతవరకు అర్థమై ఉంటుందని అనుకుంటున్నాను. ఇంతకు ముందు నేను ఈ విషయాలను కొంచెం వేగంగా చెప్పేవాడిని. మీరు గ్రహిస్తారనుకున్నాను. కానీ ఇప్పుడు చాలా నెమ్మదిగా, ప్రతి అంశాన్ని విడమరిచి చెబుతున్నాను. ఎందుకంటే, ఇలా చెపితేనే ఈ సూక్ష్మ విషయాలు స్పష్టంగా అర్థమవుతాయి.

ఈ విషయం మీరు అర్థం చేసుకుంటే, ఎవరిని ఆశ్రయించాలి? ఎవరి క్లాసులకు వెళ్ళాలి? ఏ జూమ్‌లో పాల్గొనాలి? ఎలాంటి జ్ఞానం పొందాలి? ఎప్పుడు ఆధ్యాత్మికంగా ఎదగాలి? జీవిత లక్ష్యాన్ని ఎప్పుడు సాధించాలి? గమ్యాన్ని ఎప్పుడు చేరుకోవాలి? అనే విషయాలన్నీ మీకు స్పష్టంగా తెలుస్తాయి.

ఇప్పుడు మరొక స్థాయి గురించి తెలుసుకుందాం. కొంతమంది మాస్టర్లు హైస్కూల్ మాస్టర్లు లాంటి వారు. ఆధ్యాత్మిక పరంగా హైస్కూల్ మాస్టర్లు అంటే, మనసు గురించి, మనసు వల్ల కలిగే లాభాల గురించి బోధించే మాస్టర్లు. ఇప్పుడు మీరే చెప్పండి. శరీరం గొప్పదా? లేక మనసు గొప్పదా? అలాగే, శరీరం గురించి బోధించే మాస్టర్ గొప్పవాడా? లేక మనసు

గురించి బోధించే మాస్టర్ గొప్పవాడా? ఈ తేడా మీకు కొంత అర్థమై ఉంటుంది.

కొంతమంది అడుగుతారు "మనోస్థితిలో ఉన్న మాస్టర్లను ఎలా గుర్తించాలి?" వారిని గుర్తించడం చాలా సులభం. గుర్తుంచుకోండి, ఆధ్యాత్మిక పరంగా వీరు హైస్కూల్ స్థాయి మాస్టర్లు. నేను చెప్పేది ప్రాపంచిక విద్య గురించి కాదు, ఆధ్యాత్మిక స్థాయిల గురించి.

## మనసుకు సంబంధించిన సమస్యలు ఏమిటి?

కోరికలు, మానసిక అశాంతి, నిరాశ (డిప్రెషన్), ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు, పిల్లలతో విభేదాలు, భార్యాభర్తల మధ్య కలహాలు ఇవన్నీ మనోస్థితికి సంబంధించినవే. ఈ సమస్యల నుంచి బయటపడాలని అందరూ కోరుకుంటారు. అలాంటి వారు మాస్టర్ దగ్గరకు వెళ్ళగానే, తమ సమస్యలన్నీ చెప్పడం ప్రారంభిస్తారు. అప్పుడు ఆ మాస్టర్, "దానికి ఏముంది? ఒక సంకల్పం పెట్టుకొని ధ్యానం చేయండి." అని చెబుతాడు.

ఇలాంటి సంకల్పాలు పెట్టించే ధ్యానంలో కూర్చునేటప్పుడు "సంకల్పం పెట్టి కూర్చోండి" అని చెబుతుంటారు.

ఇలాంటి మాటలు వినేవారిని సంతృప్తి పరచడానికి మాత్రమే చెప్పబడతాయి. అంతకంటే లోతైన ఆధ్యాత్మిక సత్యం వాటిలో ఉండదు. అందుకే గుర్తుంచుకోండి ధ్యానంలో సంకల్పాలు పెట్టుకోవాల్సిన అవసరం లేదు.

మీరు చేయవలసిన సాధనను సక్రమంగా చేస్తే, ఈ సృష్టిలో మీరు పొందవలసినదంతా సరైన సమయంలో పొందగలుగుతారు. కొంతమంది "పత్రి గారిని తలుచుకుని కూర్చోవాలా?", "బాబాజీని ధ్యానిస్తూ కూర్చోవాలా?" అని అడుగుతుంటారు.

మరికొందరు జూమ్‌లో, "బాబాజీ అన్నీ ఇస్తారు, ఈ మాస్టర్లు అన్నీ ప్రసాదిస్తారు." అని చెబుతుంటారు. అలాగే, సృష్టిలో ఉన్న మహానుభావుల

పేర్లన్నీ వరుసగా చెప్పి, “వారిని తలచుకుంటే చాలు” అనే అభిప్రాయాన్ని కలిగిస్తారు.

ఇవి కూడా మనసుకు సంబంధించిన బోధలే. అంటే, మనోస్థితిలో ఉన్న మాస్టర్లు చెప్పే విషయాలు ఎక్కువగా ఈ విధంగానే ఉంటాయి.

అలాంటి జూమ్ సమావేశాల్లో చిక్కుకుపోతే, చాలామంది జీవితాంతం అదే స్థాయిలో ఉండిపోతారు. వారు మనోస్థితిని దాటి ముందుకు వెళ్ళలేరు, ఆధ్యాత్మికంగా హైస్కూల్ స్థాయిలోనే ఆగిపోతారు.

ఒక్కసారి ఆలోచించండి. మీరు చదువుకునేది ఒక తరగతి నుంచి మరో తరగతికి ఎదగడానికా? లేక జీవితాంతం అదే తరగతిలో ఉండి పోవడానికా? ప్రాపంచిక జీవితంలో అయినా, ఆధ్యాత్మిక జీవితంలో అయినా, ఒక స్థాయి నుంచి మరొక ఉన్నత స్థాయికి ఎదుగుతూ ఉండాలి. ఒకే స్థాయిలో ఆగిపోవడం సరైన పద్ధతి కాదు.

ఇప్పుడు ఇంకో విషయాన్ని గమనించండి. శారీరక సమస్యలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే ధ్యానులు, అలాగే శరీరానికి సంబంధించిన లాభాలను ఎక్కువగా చెప్పే మాస్టర్లు చాలా మంది ఉంటారు. ఎందుకంటే, ఎలిమెంటరీ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఎక్కువమందా? లేక హైస్కూల్ విద్యార్థులు ఎక్కువమందా? అంటే సహజంగా ఎలిమెంటరీ పాఠశాలలే ఎక్కువగా ఉంటాయి. ప్రతి ఊరిలో ఒక ఎలిమెంటరీ పాఠశాల ఉంటుంది. కానీ హైస్కూల్ మాత్రం సాధారణంగా ఒక మండలానికి ఒకటే ఉంటుంది. అదే విధంగా, శరీర స్థితిలో ఉండే మాస్టర్లు కూడా ఎక్కువ మంది ఉంటారు. అందువల్ల, రోగాల గురించి, శారీరక ఆరోగ్యం గురించి చెప్పే మాస్టర్ల వద్దకు ఎక్కువ మంది ఆకర్షితులవుతారు.

ఎందుకంటే, ఈ ప్రపంచంలో శారీరక రోగాలతో బాధపడుతున్న

వారు చాలా మంది ఉన్నారు. అప్పుడు కొందరు ఇలా అనుకుంటారు మా మాస్టర్ దగ్గరకు ఎంతమంది వస్తున్నారో చూడండి! కిటకిటలాడిపోతోంది. ఇంతమంది వస్తున్నారంటే ఆయన చాలా గొప్ప మాస్టర్ అయి ఉండాలి. లేకపోతే ఇంతమంది ఎందుకు వస్తారు? అంటారు. కానీ జనాలని చూసి నిర్ణయించడం సరైన పద్ధతి కాదు.

అదే విధంగా, హైస్కూల్ స్థాయికి వచ్చిన తర్వాత కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, మానసిక ఒత్తిడితో బాధపడేవారు కూడా ఎంతోమంది ఉంటారు. వాళ్లు త్వరగా సమస్యల నుంచి బయటపడాలని కోరుకుంటారు. అందుకే వారికి నచ్చే విధంగా, "ఒక సంకల్పం పెట్టుకోండి అమ్మా, కచ్చితంగా ఫలితం వస్తుంది" అని చెబుతారు.

అయితే, వారు సంకల్పం పెట్టుకొని "ఈ సమస్య తగ్గిపోవాలి" అని చివరికి చేసేది ధ్యానమే కదా? అయితే ఒకసారి ఆలోచించండి. సమస్య తగ్గింది సంకల్పం వల్లనా? లేక ధ్యానం వల్లనా? కానీ చాలా మంది ఇలా ఆలోచించరు. "ఆ మాస్టర్ సంకల్పం పెట్టించాడు కాబట్టే నా సమస్య తగ్గిపోయింది. ఆయనకంటే గొప్ప మాస్టర్ ఇంకెవ్వరూ లేరు" అని నమ్మేస్తారు.

ఆ మాస్టర్ దగ్గర ఎంతో మంది కూర్చుంటారు. ఒక్కొక్కరు ఒక్కో సమస్య చెబుతారు. అప్పుడు ఆయన కొంచెం విధానం మార్చి, "ధ్యానంలో కూర్చున్నప్పుడు బాబాజీని పిలవండి" అని చెబుతారు. ఆ వ్యక్తి బాబాజీని తలచుకుంటాడు. తర్వాత, "బాబాజీ వచ్చారు" అని భావిస్తాడు. తర్వాత, "మీ ప్రశ్న అడగండి." అని చెబుతారు.

ఆ వ్యక్తి తన సమస్య చెబుతాడు. వెంటనే, "ఏమీ కాదమ్మా అంతా సరిగా అవుతుంది" అని సమాధానం వచ్చినట్లుగా భావిస్తాడు. అప్పుడు, "చూశారా! బాబాజీ స్వయంగా అన్నారుగా అంతా సరిగా అవుతుంది." అని

మరింత నమ్మకం ఏర్పడుతుంది. కొంతకాలం తర్వాత, “ప్రతి సారి బాబాజీని పిలవకండి. “ఈసారి శిరిడీ బాబాను పిలవండి.” అని చెబుతారు. వెంటనే, “శిరిడీ బాబా వచ్చారు” అని ఆ వ్యక్తి భావిస్తాడు.

ఇలాంటి మాస్టర్లు మనోస్థితిలో ఉన్న మాస్టర్లు, అంటే ఆధ్యాత్మిక పరంగా హైస్కూల్ స్థాయి మాస్టర్లు. ఈ విషయం మీకు అర్థమైతే అదృష్టవంతులే!

ఇప్పుడు మరో ఉదాహరణ చూడండి. కాలేజీ లెక్చరర్ ఎలిమెంటరీ స్కూల్‌లోకి వెళ్ళి పాఠాలు చెప్పడు. అలాగే, ఎలిమెంటరీ టీచర్ కాలేజీలో బోధించలేడు. ఎందుకంటే, కాలేజీ స్థాయిలో బోధించే విషయాలు మరింత ఉన్నత స్థాయిలో ఉంటాయి. ఇప్పుడు మీరు గమనించండి. హైస్కూల్‌లో చదివే విద్యార్థుల కంటే కాలేజీలో చదివే విద్యార్థులు తక్కువ మంది ఉంటారు.

అలా ఎందుకు జరుగుతుంది? హైస్కూల్ పూర్తిచేసిన ప్రతి ఒక్కరూ కాలేజీకి వెళ్లాలి కదా! కానీ వాస్తవంలో అలా జరగదు. చాలామంది మధ్యలోనే చదువు ఆపేస్తారు. ఎందుకు ఆపేస్తారు? కొంతమంది, “మాకు అంత చదువు రాదు.” అని అనుకుంటారు. మరికొందరికి చిన్న వయసులోనే వివాహాలు జరుగుతాయి. ఆ తర్వాత చదువు కొనసాగించే అవకాశం ఉండదు. మరికొందరి కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బందులు ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో చదువు మానేసి ఉద్యోగంలోకి లేదా ఇతర పనుల్లోకి వెళ్తారు.

ఇలా రకరకాల కారణాల వల్ల చాలామంది కాలేజీ వరకు చేరుకోలేరు. ఇంకా కొంతమంది యువకులు సెల్‌ఫోన్‌కు బాగా అలవాటు పడిపోతారు, యూట్యూబ్, సినిమాలు, వినోదాల్లో గడిపేస్తారు. చేయాల్సిన పనిని వదిలేసి, అక్కడే ఆగిపోతారు. ఇలాంటి వారు సమాజంలో చాలా మంది వున్నారు.

కాలేజీకి చేరుకునే విద్యార్థులు తక్కువగా ఉన్నట్లే, బుద్ధి స్థితిలో

ఉన్న మాస్టర్ల వద్ద శిష్యులు తక్కువ ఉంటారు.  కాలేజీలో విద్యార్థులు తక్కువగా ఉన్నారని, అక్కడి జ్ఞానం కూడా తక్కువగా ఉంటుందా? కాదు. విద్యార్థులు తక్కువగా ఉన్నా, కాలేజీ స్థాయి జ్ఞానం చాలా ఉన్నతమైనది.

అలాగే, ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థులు ఎక్కువగా ఉన్నా, అక్కడ బోధించే జ్ఞానం ప్రాథమిక స్థాయిలోనే ఉంటుంది. అయితే ఇప్పుడు మీరే చెప్పండి. ఎలిమెంటరీ టీచర్ గొప్పవాడా? హైస్కూల్ టీచర్ గొప్పవాడా? లేక కాలేజీ లెక్చరర్ గొప్పవాడా? మీకు ఉన్నత విద్య కావాలంటే ఎవరిని ఆశ్రయిస్తారు? సహజంగానే కాలేజీ లెక్చరర్‌ను ఆశ్రయిస్తారు.

ఆధ్యాత్మికంలో కూడా ఇదే వర్తిస్తుంది. శరీరానికి సంబంధించిన లాభాల గురించి చెప్పే మాస్టర్లు ఒక స్థాయి, మనసుకు సంబంధించిన లాభాల గురించి చెప్పే మాస్టర్లు మరొక స్థాయి, బుద్ధి స్థితిలో ఉన్న మాస్టర్లు వీరిద్దరికంటే ఉన్నతమైన స్థాయిలో ఉంటారు.

ఆత్మ అన్నిటికంటే గొప్పది, ఆత్మకంటే గొప్పది మరొకటి లేదు, ఆత్మజ్ఞానానికి మించిన జ్ఞానం కూడా లేదు. పత్రిగారు ఎప్పుడూ ఒక గొప్ప విషయం చెప్పేవారు “దేని గురించి తెలుసుకుంటే ఇక తెలుసుకోవాల్సింది ఏదీ ఉండదో దానినే తెలుసుకోవాలి, ఏది పొందితే ఇక పొందవలసింది ఏదీ ఉండదో దానినే పొందాలి” అని చెప్పేవారు. అదే ఆత్మజ్ఞానం.

అటువంటి ఆత్మస్థితిలో ఉన్న మాస్టర్స్ ను ఆశ్రయించినవారు, వారి వద్ద నేర్చుకున్నవారు, వారి శిక్షణ పొందినవారు కూడా క్రమంగా మాస్టర్లుగా ఎదుగుతారు. ఎలా అంటే, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ప్రొఫెసర్‌గా ఉన్న వ్యక్తి అలాంటి స్థాయికి చేరినవారి సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, వారి జ్ఞానం మాత్రం ఎంతో ఉన్నతంగా ఉంటుంది.

డిగ్రీ పూర్తిచేసిన వారిలో చాలామంది ఉద్యోగాలలో చేరిపోతారు.

కొద్దిమంది మాత్రమే మరింత ఉన్నత విద్యపై ఆసక్తి చూపి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదువుతారు. మరికొందరు కుటుంబ పరిస్థితులు లేదా ఆర్థిక ఇబ్బందుల కారణంగా డిగ్రీతోనే చదువును ముగించాల్సి వస్తుంది. ఇదే విధంగా ఆధ్యాత్మిక మార్గంలో కూడా ఆత్మజ్ఞానం వరకు చేరి, ఆ స్థాయిలో సాధన చేసే ధ్యానులు చాలా తక్కువ మంది ఉంటారు.

ఇప్పుడు మీరు ఆలోచించండి పీహెచ్‌డీ విద్యార్థులకు బోధించే ప్రొఫెసర్ గొప్పవారా? లేక ప్రాథమిక పాఠశాలలో బోధించే ఉపాధ్యాయుడు గొప్ప వారా? సహజంగానే పీహెచ్‌డీ ప్రొఫెసర్‌కే ఉన్నతమైన జ్ఞానం ఉంటుంది. అలాగే మీరు కూడా ఉన్నతమైన ఆధ్యాత్మిక స్థాయికి ఎదగాలంటే, ఉన్నతమైన ఆత్మజ్ఞానాన్ని బోధించే మాస్టర్స్ ను  ఆశ్రయించాలి. అయితే చాలా సార్లు సరైన వివేకం లేకపోవడం వల్ల సరిగా అర్థం చేసుకోలేరు. పత్రి గారు “అందరి దగ్గరా నేర్చుకోండి” అని చెప్పేవారు. కానీ ఆ మాట వెనుక ఉన్న అర్థాన్ని గ్రహించకుండా అక్కడికి ఇక్కడికి వెళ్ళడం ప్రారంభిస్తారు.

వాస్తవానికి గత జన్మలలో ప్రాథమిక స్థాయి, ఉన్నత పాఠశాల స్థాయి, కళాశాల స్థాయి వంటి అనేక ఆధ్యాత్మిక దశలను దాటి వచ్చిన సాధకుడు, ఈ జన్మలో ఆత్మజ్ఞానం అనే పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయిని నేర్చుకోవడానికి వచ్చాడు. అలాంటి సమయంలో మళ్ళీ ప్రాథమిక స్థాయి బోధల దగ్గరకు వెళ్ళడు, వెళితే అక్కడే ఆగిపోతాడు, ముందుకు ఎదగలేడు. గైడెడ్ ధ్యానాలు, సంగీత ధ్యానాలు, సంకల్ప ధ్యానాలు వంటి ప్రారంభ స్థాయి సాధనలలోనే జీవితాంతం నిలిచిపోతాడు. చివరికి ఈ జన్మ ముగిసిన తర్వాత కూడా, “నేను ఇంకా ఉన్నత స్థితికి చేరుకోవాల్సింది, కానీ మధ్యలోనే ఆగిపోయాను” అనే విచారం మిగులుతుంది.

కానీ సరైన వివేకం ఉన్న సాధకుడు మాత్రం పోస్ట్ గ్రాడ్యుయేషన్

స్థాయిలో ఉన్న ఆత్మజ్ఞాన గురువులను ఆశ్రయించి ఉన్నత స్థాయికి ఎదుగుతాడు. పత్రి గారు బోధించిన ఆత్మజ్ఞానం అనే ఉన్నత మార్గంలోనే ముందుకు సాగుతాడు. గుర్తుంచుకోండి ఆత్మజ్ఞానం అనేది ఆధ్యాత్మిక జీవితంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయి విద్య వంటిది. ఆత్మ ఎంత గొప్పదో, ఆత్మకు సంబంధించిన జ్ఞానం పొందినవారు కూడా అంతే గొప్ప వారు.

గుర్తుంచుకోండి. ఎవరైతే ఆత్మజ్ఞానం గురించి బోధిస్తారో, వారే మన సొసైటీలో అత్యున్నత స్థాయి మాస్టర్లు. అటువంటి మాస్టర్లను అనుసరించినవారు ఈ మార్గంలో ఎదుగుతారు. వారు తప్పకుండా తమ లక్ష్యానికి, అంటే మోక్షానికి, దగ్గరవుతారు. మిమ్మల్ని మోక్షానికి చేరువ చేయగలిగేది అలాంటి మాస్టర్లే, అలాంటి ప్రొఫెసర్లే అని నేను స్పష్టంగా చెబుతున్నాను. మీరందరూ ఆ స్థాయిని చేరాలనే ఆసక్తితో ఇక్కడికి వచ్చారు. అందుకే మేము ఇంత శ్రద్ధతో, ఇంత కష్టపడి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మీ లాంటి వారిలో కొంతమంది మాలా తయారైతే చాలు, మా జన్మ ధన్యమైనట్టే. మా లాంటి మాస్టర్లు ఇంకా ఎక్కువ మంది తయారైతే ఈ ప్రపంచమే మారిపోతుంది. మేమిద్దరం కృషి చేసి ఇంతమందిని తయారు చేయగలిగితే, మీరందరూ కృషి చేస్తే ఎంతటి మార్పు వస్తుందో ఒక్కసారి ఆలోచించండి.

ఇక్కడ ఉన్న జనాన్ని చూడండి. మీరందరూ ఒక్క ఊరి నుంచి రాలేదు. రెండు, మూడు రాష్ట్రాల నుంచి వచ్చారు. అందుకే ఇంత పెద్ద సంఖ్యలో కనిపిస్తున్నారు. పిహెచ్‌డీ ప్రొఫెసర్లు అంటే పత్రి గారి వంటి మహనీయులు. ఆ స్థాయికి ఎదిగిన వారి దగ్గర వినాలి, నేర్చుకోవాలి. అలా చేస్తే మీరు కూడా గొప్పవారవుతారు. అంతేకానీ, రోగాలు, సంకల్పాలు, దేహం, మనసు, చిన్నచిన్న లాభాల గురించి మాత్రమే చెప్పేవారి వెంట తిరిగితే మీరు ఎప్పటికీ ఎదగలేరు అని చాలా స్పష్టంగా చెబుతున్నాను.

ఇక్కడ వినుకొండ రామాంజనేయులు గారు ఉన్నారు. దాదాపు పదిహేనేళ్ళుగా ఈ మార్గంలో ఉన్న సీనియర్ సాధకులు. అయితే ఇన్ని సంవత్సరాలు ఆయనకు ఒక చిన్న అపోహ ఉండేది. "తటవర్తి గారు మ్యూజిక్ వద్దంటారు కానీ పత్రి గారు మ్యూజిక్‌తోనే ధ్యానం చేయిస్తారు. మరి ఎందుకు ఇలా చెబుతున్నారు?" అనే సందేహం ఆయన మనసులో ఉండేది.

ఆ అపోహతోనే పదిహేనేళ్లు గడిచిపోయాయి. కానీ ఒకరోజు యూట్యూబ్‌లో మా వీడియోలు విన్నారు. "అరే! ఇంత గొప్పగా చెబుతున్నారు. ఇన్ని సంవత్సరాలు వీరిని ఎందుకు వదిలేశాను?" అని అనిపించింది. ఆ తర్వాత ఆయన ఆలోచన మారింది. మా వీడియోలు క్రమంగా వినడం ప్రారంభించారు, తర్వాత భీమవరం కూడా వచ్చారు.

అప్పుడు ఆయన ఇలా చెప్పారు "నాకు ఒక్క సందేహమే ఉండేది. మ్యూజిక్ ఎందుకు వద్దంటారు? నేను కొంతకాలంగా మ్యూజిక్ పెట్టుకొని ధ్యానం చేసేవాడిని. తర్వాత మ్యూజిక్ లేకుండానే గంటల తరబడి ధ్యానం చేయగలిగాను. మరి నేను మ్యూజిక్ లేకుండా చేయగలిగితే, ఇతరులు మ్యూజిక్‌తో ఎందుకు చేయకూడదు? అనే సందేహం నాలో ఉండేది.

ఆ సందేహాన్ని నేను అంగీకరించకపోతే ముందుకు వెళ్ళలేనని గ్రహించాను. అందుకే దానిని అంగీకరించి, గత మూడు నెలలుగా ప్రతిరోజూ ఉదయం నాలుగు గంటలకు కూర్చొని, క్లాస్ పూర్తయ్యే వరకు తప్పకుండా వింటున్నాను. వినేటప్పుడు ముఖ్యమైన పాయింట్లన్నింటినీ వ్రాసుకుంటాను. ముందుగా ఆ పాయింట్లను నా జీవితంలో ఆచరిస్తాను."

ఇప్పుడు మీరు ఒక విషయం చాలా సింపుల్‌గా అర్థం చేసుకోండి. పత్రి గారు నిర్వహించే కడ్తాల్ యజ్ఞంలో సంజయ్ కింగ్ గారు పక్కనే కూర్చొని సంగీతం వాయిస్తుంటారు. అదే సమయంలో పత్రి గారు అందరికీ జ్ఞానాన్ని

బోధిస్తూ, ధ్యానానికి అవసరమైన మార్గదర్శకత్వాన్ని ఇస్తుంటారు.

ఇప్పుడు ఈ ఇద్దరినీ గమనించండి. పత్రి గారు జ్ఞానంలో ఛాంపియన్, సంజయ్ కింగ్ గారు సంగీతంలో ఛాంపియన్. అయితే ఈ ఇద్దరి లో గొప్ప వారు ఎవరు? పత్రిగారి దగ్గర ఉన్నది జ్ఞానం. మరి జ్ఞానం ఉన్నవారు గొప్ప వారా? లేక సంగీతం వచ్చినవారు గొప్ప వారా? అంటే నిస్సందేహంగా జ్ఞానం ఉన్నవారే గొప్ప వారు. అయితే సంగీతం ఎలా గొప్పది అవుతుంది? సంగీతం వింటే ఆత్మజ్ఞానం రాదు. కానీ మీరు "శ్వాస మీద ధ్యాస" పెట్టినప్పుడు మీ జ్ఞానం అపారంగా పెరుగుతుంది.

కొంతమంది అడుగుతారు "సార్! పత్రి గారు కూడా మ్యూజిక్ పెట్టి ధ్యానం చేయించేవారు కదా. మరి ఇప్పుడు ఎందుకు మ్యూజిక్ వద్దంటున్నారు?" అందుకు నేను ఒకటే చెబుతాను. పత్రి గారు ఎప్పుడు ఏం చేయించారో, ఎందుకు చేయించారో పూర్తిగా అర్థం చేసుకునే స్థాయి మనకు లేదు. మన పరిమితమైన జ్ఞానంతో ఆయనను అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తాం. కానీ ఆయన జ్ఞాన పరిధి ఎంతో విశాలమైనది. పత్రి గారు చాలా స్పష్టంగా ఒక మాట చెప్పారు **"నేను చెప్పింది చేయండి. నేను చేసింది చేయకండి"** ఆయన చెప్పింది "శ్వాస మీద ధ్యాస" పెట్టండి అనే.

ఆయన చేసిన ప్రతి పనిని అనుకరించమని ఎక్కడా చెప్పలేదు. దీనిని ఒక ఉదాహరణతో అర్థం చేసుకోండి. మీ అందరికీ షిరిడీ బాబా గురించి తెలుసు. ఆయన ఎంత గొప్ప మహనీయుడో కూడా తెలుసు. షిరిడీ బాబా వంట చేసేటప్పుడు కొన్నిసార్లు తన చేతి తోనే ఆహారాన్ని కలిపేవారు. అందుకని మీరు కూడా చేతితోనే కలుపుతారా? అలా చేస్తే మీ చేయి కాలిపోతుంది. ఆయనకు ఏమీ కాలేదు కాబట్టి, మీరు కూడా అలాగే చేయాలని అనుకోవడం సరైంది కాదు. అందుకే మహనీయులు చెప్పింది ఆచరించాలి.

వారు చేసింది అనుకరించడానికి ప్రయత్నించకూడదు.

ఇది దాదాపు పదిహేను నుంచి ఇరవై సంవత్సరాల క్రితం జరిగింది. ఒకసారి పత్రి గారు ఒక పల్లెటూరికి క్లాస్ చెప్పడానికి వెళ్లారు. క్లాస్ ముగిసిన తర్వాత అక్కడి నిర్వాహకుల ఇంటికి వెళ్ళారు. మేము కూడా ఆయనతో పాటు ఉన్నాం. అక్కడ సుమారు పదిహేను నుంచి ఇరవై మంది సాధకులు కూర్చున్నారు. అంతలో పత్రి గారికి గౌరవంగా ఒక గ్లాసు నీళ్లు తీసుకొచ్చి ఇచ్చారు. మేమంతా ఆయన నీళ్లు త్రాగుతారని అనుకున్నాం.

కానీ ఆయన ఒక్కసారిగా ఆ గ్లాసు తీసుకుని ఎదురుగా కూర్చున్న ఒక వ్యక్తి ముఖంపై నీళ్లు పోశారు. అక్కడ ఉన్న వారందరూ ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. "ఆ వ్యక్తి ఏం తప్పు చేశాడు?" "క్లాస్‌లో ఏమైనా పొరపాటు చేశాడా?" "ఎందుకు ఇలా చేశారు?" అని ఒక్కొక్కరి మనసులో ఒక్కో ఆలోచన వచ్చింది. కొంతసేపటి తర్వాత పత్రిగారే అడిగారు "నేను ఈ వ్యక్తిపై నీళ్ళు ఎందుకు పోశానో మీలో ఎవరైనా చెప్పగలరా?" ఎవరూ సమాధానం చెప్పలేదు. ఎందుకంటే ఎవరు ఏదైనా చెప్పినా అది తప్పు కావచ్చు అనే భావంతో అందరూ మౌనంగా ఉన్నారు.

అప్పుడు పత్రి గారే చెప్పారు "ఈ పని నేను ఎందుకు చేశానో నాకు మాత్రమే తెలుసు అది మీకు ఎప్పటికీ పూర్తిగా తెలియదు." అప్పుడు మాకు అర్థమైంది పత్రి గారు చేసే ప్రతి పని వెనుక ఒక లోతైన ఉద్దేశ్యం ఉంటుంది. కానీ ఆ ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకునే స్థాయి ప్రతి ఒక్కరికీ ఉండదు. అలాగే పత్రి గారు మ్యూజిక్‌తో ధ్యానం ఎందుకు చేయించారో కూడా పూర్తిగా మనకు తెలియదు.

"ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస" ఈ మాటను బుద్ధుడు కూడా చెప్పారు. కాబట్టి మీరు "శ్వాస మీద ధ్యాస" పెట్టాలి. మ్యూజిక్ మీద, గైడింగ్స్

మీద ధ్యాస పెట్టిన వారి జన్మ వృథానే. కానీ "శ్వాస మీద ధ్యాస" పెట్టి ధ్యానం చేసినవారు అద్భుతంగా ఎదుగుతారు, అపారమైన జ్ఞానాన్ని సంపాదిస్తారు, ఎన్నో జన్మల సాధనను వేగంగా పూర్తి చేసుకుంటారు.

ఇప్పుడు "అందరి దగ్గర నేర్చుకోండి" అనే పత్రి గారి మాటకు అసలు అర్థం ఏమిటో తెలుసుకోండి. దాని అర్థం ఎవరు పడితే వారి దగ్గర నేర్చుకోండి అని కాదు. ఆత్మజ్ఞానం బోధించే మహనీయుల దగ్గర నేర్చుకోండి అనే అర్థం. కాబట్టి దేహ స్థాయిలో ఉన్నవారి దగ్గర, మనోస్థాయిలో ఉన్నవారి దగ్గర, బుద్ధి స్థాయిలో ఉన్నవారి దగ్గర మాత్రమే ఆగిపోకుండా, ఆత్మజ్ఞానాన్ని బోధించే మాస్టర్ల దగ్గర నేర్చుకోండి, కొత్త కొత్త ఆత్మజ్ఞాన విషయాలను తెలుసుకోండి, ఆత్మజ్ఞానాన్ని పెంచే పుస్తకాలను చదవండి. అలా మీరు కూడా గొప్ప మాస్టర్లుగా ఎదగగలుగుతారు.



## ధ్యానం చేసే పద్ధతి
## శ్వాస మీద ధ్యాస



ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతోన్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమక్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీమండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండలశుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.

# అనుకున్నది సాధించలేకపోవటానికి, ఆచరించలేకపోవటానికి కారణాలు

చాలా మందిలో కనిపించే ఒక ప్రధాన లోపం ఏమిటంటే అనుకున్నది చేయలేరు, ఆచరించాలని అనుకుంటారు, కానీ ఆచరించలేరు. ఈ బలహీనత వారికి ఎంతో నష్టాన్ని కలిగిస్తుంది, అంతేకాక, కష్టాలను కూడా తెచ్చిపెడుతుంది. అందువల్ల దీనికి కారణం ఏమిటి? దీన్ని ఎలా అధిగమించాలి? అనే విషయాన్ని ఇప్పుడు తెలుసుకుందాం.

చాలా కాలంగా మిమ్మల్ని గమనిస్తూ ఉంటే నాకు కలిగిన ఒక ఆలోచనను ఇప్పుడు మీతో పంచుకోబోతున్నాను. మీలో చాలామంది ఉదయం జూమ్ సమయానికి లేవాలని అనుకుంటారు, కానీ లేవలేరు, ఇది మీలో చాలామందికి వర్తించే విషయం.

అలాగే, లేచిన తర్వాత జూమ్‌లో వీడియో ఆన్ చేయాలని అనుకుంటారు, కానీ వీడియో ఆన్ చేయరు. ఉదయం లేవలేకపోవడానికి కారణం ఏమిటని అడిగితే, “బద్ధకం” అని చెబుతారు. వీడియో ఆన్ చేయలేకపోవడానికి కారణం ఏమిటని అడిగితే, “భయం” అని చెబుతారు. కొంత మందికి చేయి ఎత్తాలని ఉంటుంది, కానీ చేయి ఎత్తలేరు. జూమ్‌లో మాట్లాడాలని అనుకుంటారు కానీ మాట్లాడలేరు. ఇలాంటి బలహీనతలు ఉండడం వల్ల ఎదగాలని కోరుకునే వారు కూడా ఎదగలేక పోతుంటారు.

కానీ చేయాలనుకున్నది ధైర్యంగా చేయగలిగిన వారు మాత్రం అద్భుతంగా ఎదుగుతుంటారు. చాలామందికి “నేను ఎదగాలి, మాట్లాడాలి, క్లాసులు చెప్పాలి” అనే కోరిక ఉంటుంది. కానీ కోరిక గానే మిగిలిపోతుంది, ఆచరణలోకి రాదు. అందువల్ల ఇటువంటి బలహీనతల నుంచి ఎలా

బయటపడాలో తెలుసుకోవడం చాలా అవసరం. ఇది అవసరమా అని అడిగితే, ఖచ్చితంగా అవసరమే.

నిజ జీవితంలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. ఉదాహరణకు, "అబద్ధం చెప్పకూడదు" అని అనుకుంటారు, కానీ అబద్ధం చెప్పేస్తారు. "ఎవరినీ విమర్శించకూడదు" అని అనుకుంటారు, కానీ విమర్శిస్తూనే ఉంటారు. తర్వాత, "ఎందుకో తెలియదు, అనుకోకుండా అలా మాట్లాడేశాను" అని అంటుంటారు.

పత్రి గారు ఎప్పుడూ 'నో కామెంట్' అని చెప్పేవారు. ఆ మాట వింటారు, వ్రాసుకుంటారు, అలాగే ఉండాలని కూడా అనుకుంటారు కానీ ఆచరించలేరు. "మూడో వ్యక్తి గురించి పట్టించుకోకూడదు. ఎవరు ఏమనుకుంటే నాకేమిటి?" అని అనుకుంటారు. కానీ ఆచరణలో మాత్రం, "ఇలా చేస్తే వాళ్ళు ఏమనుకుంటారో? ఇలా చేస్తే వీళ్ళు ఏమనుకుంటారో?" అని ఆలోచిస్తూ ఉంటారు. "నేను చేయాల్సింది నేను చేస్తాను, ఎవరు ఏమనుకున్నా నాకు సంబంధం లేదు" అనే స్థితిలో ఉండాలని అనుకుంటారు, కానీ అలా ఉండలేరు.

"ఇతరుల గొడవల్లో తలదూర్చకూడదు" అని అనుకుంటారు, కానీ చివరకు వారి గొడవల్లో తామే జోక్యం చేసుకుంటారు. ఇంకా కొంతమంది మాంసాహారం మానేయాలని అనుకుంటారు. దాని గురించి చెప్పినప్పుడు, "అవును, మానేస్తేనే మంచిది" అని అంగీకరిస్తారు. కానీ ఏదైనా ఫంక్షన్‌కు వెళ్లినప్పుడు, పార్టీకి వెళ్లినప్పుడు, మాంసాహారాన్ని చూడగానే మనసు దాని వైపు లాగుతుంది, నోరూరుతుంది. "ఇంకెప్పుడూ తినకూడదు" అని అనుకున్నవారే మళ్ళీతినేస్తారు.

మరికొందరు మద్యం, ధూమపానం, జూదం, పేకాట వంటి అలవాట్లను మానేయాలని అనుకుంటారు, కానీ మానలేరు. "ఎవరినీ మోసం

చేయకూడదు” అని అనుకుంటారు, కానీ మోసం చేస్తూనే ఉంటారు. “స్వార్థాన్ని ప్రదర్శించకూడదు” అని నిర్ణయించుకుంటారు, కానీ ప్రవర్తనలో మాత్రం స్వార్థాన్ని చూపిస్తూనే ఉంటారు. ఇతరులను తక్కువగా చూడకూడదని అనుకుంటారు, కానీ అలా చూస్తూనే ఉంటారు. ఇతరులకు మంచి చేయాలని అనుకుంటారు, సహాయం చేయాలని అనుకుంటారు కానీ చేయలేరు. సేవా కార్యక్రమాలకు తమ వద్ద ఉన్న దాంట్లో కొంత ఇవ్వాలని అనుకుంటారు కానీ ఇవ్వలేరు. ధర్మంగా జీవించాలని అనుకుంటారు, కానీ అలా జీవించ లేరు. దానాలు చేయాలని అనుకుంటారు, కానీ చేయలేరు. నేను అందరి గురించి చెప్పడం లేదు, కొంతమంది గురించి మాత్రమే చెబుతున్నాను

ఇలా చెప్పుకుంటూ పోతే, ఎన్నో మంచి పనులు చేయాలని అనుకుంటారు కానీ ఆచరణలో చేయలేరు. అందువల్ల చేయవలసింది ఒకటి, చేస్తున్నది ఇంకొకటి అవుతుంది. కాసేపు ఆలోచించండి. అలా జీవించే జీవితం ఎలా ఉంటుందో చూడండి. అనుకున్నదానికి విరుద్ధంగా ప్రవర్తిస్తూ ఉంటారు. మరి దీనికి కారణం ఏమిటి? అనే విషయాన్ని ఆలోచిస్తే నిజానికి మీలో ఈ బలహీనతలన్నీ ఉండకపోవచ్చు. ఒక్కొక్కరిలో ఒక్కో బలహీనత ఉంటుంది, దానిని ఎలా అధిగమించాలి? “నా పరిస్థితి ఇలా ఉండడానికి కారణం ఏమిటి?” అని మీరు మీరే ఆలోచించాలి.

ఎందుకంటే అనుకోవడం ఒకటి, ఆచరించడం ఇంకొకటి. అనుకునేది ఎవరు? ఆచరించేది ఎవరు? అనే ప్రశ్న వస్తుంది, మళ్ళీ, “నేనే” అని సమాధానం చెబుతారు. అయితే నిజంగా ఆ “నేను” ఎవరు? మీలో ఎన్నో భాగాలు ఉన్నాయి. వాటిలో దేని పాత్ర ఏమిటో తెలుసుకోవాలి. అనుకునేది మనసే, చేయించాలని ప్రయత్నించేది కూడా మనసే, శరీరంతో పనులు చేయించేది కూడా మనసే. కానీ విచిత్రం ఏమిటంటే? ఒకటి అనుకొని

ఇంకొకటి చేయించేది కూడా అదే మనసు.

అందుకే ఈ పరిస్థితికి కారణం మనసే అని అంటాము. అయితే మనసులోనే ఒక భాగమైన బుద్ధి నిర్ణయాలను తీసుకుంటుంది. మరి ఈ స్థితిని మీరు దాటాలంటే, అనుకున్నట్లుగా జీవించాలంటే ఏమి చేయాలి? ఈ శరీరం, ఇంద్రియాలు ప్రస్తుతం మనసు చెప్పినట్లే పనిచేస్తున్నాయి. కానీ మీరు అనుకున్నదాన్ని పూర్తిగా ఆచరించాలంటే, మనసు అధీనంలో ఉన్న ఈ శరీరాన్ని, ఇంద్రియాలను ఆత్మ అధీనంలోకి తీసుకురావాలి. సహజంగా ఇప్పుడు ఇంద్రియాలు ఎవరి అధీనంలో ఉంటాయి? మనసు అధీనంలోనే ఉంటాయి. మనసు అధీనంలో ఉన్నంతకాలం ఆచరణ కూడా మనసు స్థితిని బట్టే ఉంటుంది. కానీ మనసు అధీనంలో ఉన్న ఈ శరీరాన్ని, ఇంద్రియాలను ఆత్మ అధీనంలోకి తీసుకువస్తే అంటే సాక్షాత్తు భగవంతుడి అధీనంలోకి తీసుకువస్తే అనుకున్నది ఆచరిస్తారు.

కొంచెం ఆలోచించండి. భగవంతుడు చేయకూడని పనులు చేయిస్తాడా? తప్పులు చేయిస్తాడా? పాపాలు చేయిస్తాడా? చేయించడు. అందువల్ల మనసు అధీనంలో ఉన్న ఈ శరీరాన్ని, ఇంద్రియాలను ఆత్మ అధీనంలోకి తీసుకురావాలి.

అయితే దానికి ముందు మనసును శుద్ధి చేసుకోవాలి. మనసు ఎంత శుద్ధిగా ఉంటే, మీరు అనుకున్న వాటిని అంత సులభంగా ఆచరించగలుగుతారు. మరి మనసును ఎలా శుద్ధి చేయాలి? మనసును శుద్ధి చేస్తూ, క్రమంగా ఆత్మ అధీనంలోకి తీసుకురావాలి. అది ఎలా చేయాలో తెలుసుకుందాం.

సాధారణంగా ప్రతి మనిషి మనస్సు తమోగుణం లేదా రజోగుణం ప్రభావంలోనే ఉంటుంది. నా అంచనా ప్రకారం, ఆధ్యాత్మిక జ్ఞాన మార్గంలోకి

ఇంకా ప్రవేశించని వారిలో అధిక శాతం మంది తమోగుణ ప్రభావంలో ఉంటారు. అయితే, జ్ఞాన మార్గంలోకి రాని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమోగుణంలోనే ఉంటారని చెప్పలేం. కానీ, ఎక్కువ మంది మాత్రం తమోగుణ ప్రభావంలోనే జీవిస్తుంటారు. అలాగే, ధ్యానం లేదా ఆధ్యాత్మిక మార్గంలోకి ప్రవేశించిన వారిలో కూడా చాలామంది ఇంకా రజోగుణ ప్రభావం నుంచి పూర్తిగా బయటపడక, ఆ స్థితిలోనే కొనసాగుతుంటారు.

కానీ ధ్యానాన్ని తీవ్రంగా ఆచరిస్తూ, భీమవరం వంటి ధ్యాన శిబిరాలకు హాజరవుతూ, నెలల తరబడి, సంవత్సరాల తరబడి నిరంతర సాధన చేస్తే, ఎవరైనా తప్పకుండా సాత్విక గుణస్థితికి చేరుకుంటారు. మన భీమవరం తరగతులకు వచ్చే వారిలో ఎక్కువమంది సాత్విక గుణంలోనే ఉంటారు.

ఇప్పుడు ఒక విషయం మీరు గుర్తుంచుకోవాలి. తమోగుణంలో ఉన్న వ్యక్తి మనసు అతని స్వాధీనంలో ఉండదు. అందువల్ల వారు ఒకటి అనుకుంటారు, కానీ ఇంకొకటి చేస్తారు. అనుకున్నదాన్ని ఆచరించ లేకపోవడానికి ఇదే ప్రధాన కారణం. ఇటువంటి స్థితిలో ఉన్నవారిలో శరీరం, ఇంద్రియాలు పూర్తిగా మనసు చెప్పినట్లే పనిచేస్తుంటాయి. మనసు ఒకటి అనుకుంటుంది, కానీ ఆచరణలో మాత్రం దానిని అమలు చేయలేకపోతుంది. ఇలాంటి మనసునే తమోగుణ ప్రభావంలో ఉన్న మనసు అంటారు, అంటే పూర్తిగా మలినమైన మనసు. అలాంటి మనసు ఉన్నవారు చేయకూడని పనులనే ఎక్కువగా చేస్తుంటారు. వారి ఆలోచనలు, వారి ప్రవర్తన పరస్పర విరుద్ధంగా ఉంటాయి. అందుకే వారి జీవితంలో కష్టాలు కూడా ఎక్కువగానే ఉంటాయి. అందువల్ల మనసు అధీనంలో ఉన్న ఈ శరీరం, ఇంద్రియాలు క్రమంగా మనసు ప్రభావం నుంచి బయటకు రావాలి. అంటే మనసు యొక్క ప్రాముఖ్యం

తగ్గాలి.

దానికి రెండు విషయాలను తప్పకుండా ఆచరించాలి. మొదటిది తీవ్ర ధ్యాన సాధన, రెండోది  సాత్వికమైన ఆహారం తీసుకోవడం. తీవ్ర ధ్యాన సాధన అంటే గంటల తరబడి కళ్ళు మూసుకుని కూర్చోవడం కాదు, గంటల తరబడి ధ్యాన స్థితిలో ఉండగలగడం. అంటే ఆలోచనలు లేని స్థితిలో ఉండగలగడం. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, మనసు పని చేయని స్థితిలో ఉండగలగడం. ఈ విషయం మీరు బాగా గుర్తుంచుకోవాలి.

కేవలం మ్యూజిక్ వింటూ లేదా గైడెడ్ మెడిటేషన్ చేస్తూ ఉంటే మనసు పని చేస్తూనే ఉంటుంది. అలాంటి సాధన వల్ల మనసులో మార్పు రాదు. కానీ మనసు పూర్తిగా నిశ్శబ్దమైన స్థితిలో కూర్చో గలిగితే, ఖచ్చితంగా మనసులో మార్పు వస్తుంది, మనసు బలహీనపడుతుంది. తమోగుణంలో ఉన్న మనసు చాలా బలంగా ఉంటుంది. అందుకే అది మనిషిని తన ఇష్టానుసారం నడిపిస్తుంది.

ఒక ఉదాహరణ చెప్పాలంటే, మీరు మూడు గంటలు లేదా నాలుగు గంటలు ధ్యానంలో కూర్చున్నారు అనుకోండి. తర్వాత ఓ.కె. అని చెప్పి కళ్ళు తెరవమంటే, “అదేంటి! ఇప్పుడే కదా కూర్చున్నాం, అప్పుడే పూర్తయ్యిందా?” అనే భావన మీకు కలిగితే, మీరు నిజమైన తీవ్ర ధ్యాన సాధన చేసినట్లే. అటువంటి సాధన చేసినవారికే జీవితంలో నిజమైన ఫలితాలు లభిస్తాయి, ఇది తప్పకుండా గుర్తుంచుకోవాలి.

కేవలం ఉదయం ఒక గంట మ్యూజిక్ పెట్టుకుని కూర్చోవడం, సాయంత్రం మరో గంట మ్యూజిక్‌తో కూర్చోవడం, లేదా ఎవరో చెప్పే గైడింగ్‌ను వింటూ అందులో లీనమవడం కాదు. అప్పుడు మనసు ఇంకా పనిచేస్తూనే ఉంటుంది. అలాంటి సాధన వల్ల మీలో ఏ మార్పు రాదు. నేను ఖచ్చితంగా

చెబుతున్నాను. తీవ్ర ధ్యాన సాధన అంటే మనసు పని చేయని స్థితిలో ఉండటం. ఆ స్థితిలో ఎన్ని గంటలు కూర్చున్నా, ఐదు నిమిషాలు మాత్రమే గడిచినట్లుగా అనిపించాలి, అదే నిజమైన ధ్యానం.

అటువంటి ధ్యాన సాధనను కొంతకాలం నిరంతరంగా చేస్తే, మనసు యొక్క ప్రాముఖ్యం క్రమంగా తగ్గుతుంది, మనసు పలుచబడుతుంది. అప్పుడు తమోగుణం నుంచి రజోగుణ స్థితికి వస్తుంది.

ఈ శరీరంలో ఒక అపారమైన శక్తి ఉంది, అదే ఆత్మ. ఆత్మ అనంత శక్తి కలది, అఖండ తేజస్సుతో నిండి ఉంటుంది. అయితే ఆ ఆత్మలో అంతటి తేజస్సు ఉన్నప్పటికీ, అది మీ జీవితంలో పూర్తిగా వ్యక్తం కావడం లేదు అంటే ఆత్మను మనసు కప్పి ఉంచింది. ఇది భగవద్గీత 3 అధ్యాయం, 38వ శ్లోకంలో చెప్పబడింది.

**శ్లో॥ "ధూమేనావ్రియతే వహ్నిర్యథాదర్శో మలేన చ।**
**యథోల్బేనావృతో గర్భస్తథా తేనేదమావృతమ్॥" (భ.గీ.3-38)**

తాత్పర్యం: పొగ అగ్నిని కప్పినట్లుగా, మురికి అద్దాన్ని కప్పినట్లు గా, గర్భంలోని శిశువును మావి కప్పినట్లుగా మనసు ఆత్మను కప్పి ఉంచింది.

అందుకే కోటి సూర్యుల తేజస్సు కలిగిన ఆత్మ ఈ శరీరంలో ఉన్నప్పటికీ బయటకు వ్యక్తం కావడం లేదు. పత్రి గారు "మనమందరం దేవుళ్ళమే" అని చెప్పేవారు. ఆ మాట విన్నప్పుడు చాలామందికి సందేహం వస్తుంది. "మనం ఎక్కడ దేవుళ్లం? దేవుని శక్తులు మన దగ్గర ఎక్కడ ఉన్నాయి? మనం చెప్పిన వెంటనే ఏదీ జరగడం లేదు కదా!" అని అనిపిస్తుంది.

కానీ మీరు నమ్మినా, నమ్మకపోయినా, నిజంగా మీరందరూ దైవస్వరూపులే. అయితే మానవుల్లా ఎందుకు ప్రవర్తిస్తున్నారు? దానికి కారణం ఒక్కటే. ఆత్మపై మనసు అనే పొర ఉంది, ఆ మనసు ఒక్కొక్కరిలో ఒక్కో

స్థాయిలో ఉండడం వల్ల ఒక్కొక్కరి ప్రవర్తన ఒక్కో విధంగా ఉంటుంది. అందుకే అందరూ మనుషులే అయినప్పటికీ, అందరి ప్రవర్తన ఒకేలా ఉండదు.

భీమవరం నిరంతరం హాజరయ్యేవారిలో తమోగుణ ప్రభావం చాలా వరకు తగ్గిపోతుంది, చాలామంది రజోగుణ స్థితికి చేరుకుంటారు. కానీ ఇంకా తీవ్రంగా, నిరంతరంగా, “శ్వాస మీద ధ్యాస” ఉంచి నెలల తరబడి, సంవత్సరాల తరబడి సాధన చేసినప్పుడు, మనసు మరింత పలుచబడుతుంది. మనసు యొక్క ప్రాముఖ్యం తగ్గిపోతుంది. అదే సమయంలో ఆత్మ తేజస్సు మరింత స్పష్టంగా వ్యక్తమవడం ప్రారంభమవుతుంది. ఆత్మ తేజస్సు క్రమంగా వ్యక్తమవుతున్న కొద్దీ, మీరు రజోగుణ స్థితి నుంచి సాత్విక గుణ స్థితిలోకి ప్రవేశిస్తారు.

ఇప్పుడు మీలో కొందరికి ఒక సందేహం రావచ్చు. “మేము చాలాకాలంగా సాధన చేస్తున్నాం. మరి మేము సాత్విక గుణంలోకి వచ్చామా? లేదా?” అని అనిపించవచ్చు. దానికి సాత్విక గుణంలోకి వచ్చినవారు ఏదో ఒకరికి సహాయం చేయాలని అనుకుంటారు, ఏదో ఒక గొప్ప సేవా కార్యక్రమంలో పాల్గొనాలని కోరుకుంటారు, ఏదో ఒక మంచి పని చేయాలని తపిస్తారు.

ఈరోజు కర్ణాటకలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి మన వారు చూపించిన స్పందనను గమనిస్తే, చాలామంది నిజంగా సాత్విక గుణ స్థితికి చేరుకున్నారని అర్థమవుతుంది. ఇంకా “ మనకెందుకు?” అని అనుకునేవారు ఉంటే, వారు ఇంకా ఆ స్థితికి చేరుకోలేదని అర్థం.

మరికొందరు, “ఏదో ఒక కార్యక్రమం పెట్టి మన అందరి చేత డబ్బు ఖర్చు పెట్టించాలనుకుంటున్నారు” అనే భావనతో విమర్శిస్తే, వారు కూడా ఇంకా సాత్విక స్థితికి చేరుకోలేదని అర్థం. అందుకే నేను ఎప్పుడూ

కనీసం ఈ స్థితికైనా రండి అని చెబుతుంటాను. సాత్విక గుణంలో ఉన్నవారిలో బుద్ధి కూడా స్పష్టంగా పనిచేస్తుంది. వారు అనుకున్నదాన్ని ఆచరిస్తారు. ఇవ్వాలని అనుకుంటే ఇస్తారు, ఇక్కడికి రావాలని అనుకుంటే వస్తారు.

ప్రతి నెల హాజరు కావాలని నిర్ణయించుకుంటే తప్పకుండా వస్తారు. జూమ్‌లో పాల్గొనాలని అనుకుంటే పాల్గొంటారు. అంటే అనుకున్నదాన్ని ఆచరించే శక్తి సాత్విక గుణంలో ఉంటుంది. అయితే ఈ స్థితిలోకి వచ్చిన తర్వాత కూడా సాధనను ఆపకూడదు, నిరంతరం కొనసాగించాలి. కొన్ని నెలలు, కొన్ని సంవత్సరాలు తీవ్రంగా సాధన చేస్తే, సాత్విక గుణాన్ని కూడా అధిగమించి మరింత ఉన్నత స్థితికి చేరుకుంటారు. దీనినే శుద్ధ సాత్విక స్థితి అంటారు. ఇది దైవ స్థితి. సాధారణ సాత్విక గుణానికి విభీషణుడు ఉదాహరణ అయితే, శుద్ధ సాత్విక స్థితికి ఆంజనేయ స్వామి ఉదాహరణ.

మీరు, “ఇదే నా చివరి జన్మ కావాలి” అని దృఢసంకల్పంతో తీవ్ర సాధన చేస్తూ, భీమవరం మాత్రమే కాకుండా, ఎక్కడ మూడు రోజులు క్లాసులు జరుగుతూ ఉంటే అక్కడికి కూడా వెళ్తూ, నిరంతర సాధన కొనసాగిస్తే, ఈ జన్మలోనే శుద్ధ సాత్విక స్థితిని దాటి నిర్గుణ స్థితికి చేరుకునే అవకాశం ఉంటుంది. నిర్గుణ స్థితికి చేరుకున్నవారు సాక్షాత్తు దైవ స్వరూపులే. వారు మనసు అధీనంలో ఉన్న శరీరాన్ని పూర్తిగా ఆత్మ అధీనంలోకి తీసుకువచ్చినవారు. అటువంటి వారి జీవితం దైవ చైతన్యానికి ప్రత్యక్ష రూపంగా మారుతుంది. మీ సాధన యొక్క లక్ష్యం కూడా ఇదే స్థితిని చేరుకోవడమే కావాలి. చాలామంది, “ఆరు నెలల నుంచి వస్తున్నాను, ఇక సరిపోతుంది” అని మధ్యలోనే సాధనను ఆపేస్తారు.

కానీ అది సరైన విధానం కాదు. మీ ప్రవర్తన పూర్తిగా దైవ స్వభావంగా మారినప్పుడు మాత్రమే మీరు సరైన సాధన చేస్తున్నారని చెప్పవచ్చు.

అందుకే నేను మీకు ఒకటే చెబుతున్నాను. మీరు అనుకున్నదాన్ని ఆచరించాలంటే కనీసం సాత్విక గుణ స్థితికి అయినా చేరుకోవాలి. రజోగుణం లేదా తమోగుణంలో ఉన్నంతకాలం, అనుకునేది ఒకటి, చేసేది ఇంకొకటి అనే పరిస్థితి కొనసాగుతూనే ఉంటుంది. అలాంటి స్థితిలో జీవించినా, జీవించకపోయినా పెద్దగా తేడా ఉండదు.




బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

**ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం**

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

*నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

*ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం*

రిజిస్ట్రేషన్ కొరకు : ***సింధూర, సెల్: 8555995217***

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**
**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**
**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|

## తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే

a) Whatsapp group లో మీకు పంపబడుతున్న Youtube లింక్ మీద నొక్కినప్పుడు Tatavarthy Veera Raghava Rao ఛానెల్ open అవుతుంది. Open అవ్వగానే subscribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

## YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు

a) Channel Name : Tatavarthy Veera Raghava Rao. ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

b) అలాగే PMC వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క YouTube Channel ప్రారంభించారు. Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao

c) తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు Tatavarty Spiritual Trainees ఛానెల్‌లో చూడండి.

d) Direct గా YouTube app లోకి వెళ్ళి search bar లో Tatavarthy Veera Raghava Rao అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ఆత్మజ్ఞాన శిక్షణా తరగతుల రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) మరణించక ముందే మరణించాలి - రూ.130/-
9) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం - రూ.120/-
10) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
11) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
12) జీవిత సూక్ష్మాలు - రూ.100/-
13) భగవంతుడంటే - రూ.100/-
14) తెలుసుకోండి - రూ.100/-
15) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
16) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు - రూ.100/-
17) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
18) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
19) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు - రూ.100
20) కఠోపనిషత్తు - రూ.90/-
21) ఉపమాన జ్ఞాన సందేశాలు - రూ.90/-
22) గీతాసందేశం - రూ.80/-
23) ముఖ్యమైన సందేశాలు-1 - రూ.80/-
24) ముఖ్యమైన సందేశాలు-2 - రూ.90/-
25) కర్మ సిద్ధాంతం - రూ.80/-
26) ధ్యానమంటే ? - రూ.80/-
27) త్రివిధాలు - రూ.80/-
28) ఉత్తమ పురుషుడు - రూ.80/-
29) పత్రీజీ జ్ఞాన సందేశాలు-1 - రూ.80/-
30) పత్రీజీ జ్ఞాన సందేశాలు-2 - రూ.80/-
31) పత్రీజీ జ్ఞాన సందేశాలు-3 - రూ.90/-
32) వశిష్ఠుల వారి సందేశాలు - రూ.70/-
33) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
34) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
35) జ్ఞాన జ్యోతి - రూ.70/-
36) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
37) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
38) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
39) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య - రూ.70/-
40) బుద్ధుని సందేశాలు - రూ.70/-
41) భూతదయే దైవత్వం - రూ.70/-
42) ఆత్మహంతకులంటే ఎవరు? - రూ.70/-
43) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
44) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
45) ఆశ్చర్యకరమైన విషయాలు - రూ.70/-
46) మానవునిలోని చెడు - రూ.70/-
47) మేడమ్ బ్లావెట్స్కీ సందేశాలు - రూ.70/-
48) చివటం అమ్మవారి సందేశాలు - రూ.70/-
49) మోక్షం అంటే? - రూ.70/-
50) కబీరు సందేశాలు-1 - రూ.70/-
51) మనసు-1 - రూ.70/-
52) మనసు-2 - రూ.70/-
53) " అందరి కోసం బ్రతికినా నీకు దక్కింది ఏమిటి? " రూ.70/-
54) ధ్యాన శక్తి కోల్పోకూడదంటే - రూ.70/-
55) మరణానంతరం జరిగేది-1 - రూ.60/-
56) మరణానంతరం జరిగేది-2 - రూ.70/-
57) ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు- రూ.70/-
58) మరణానంతరం జరిగేది-3 - రూ.60/-
59) కబీరు సందేశాలు-2 - రూ.60/-
60) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
61) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
62) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
63) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
64) అతీంద్రియ శక్తులు - రూ.60/-
65) ఆలోచించండి - రూ.60/-
66) నిర్వాణ మార్గం - రూ.60/-
67) ధ్యానులకు సూచనలు - రూ.60/-
68) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
69) మమకారం - రూ.60/-
70) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-1 - రూ.60/-
71) మాణిక్యేశ్వరి మాత సందేశాలు-2 - రూ.50/-
72) మాస్టర్‌గా ఎదగాలంటే? - రూ.50/-
73) భగవంతుని ఇష్టులవ్వాలంటే - రూ.50/-
74) సంకల్పమంటే? - రూ.50/-
75) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
76) మూడురకాల భవిష్యత్తులు - రూ.50/-
77) అరిహంత్ - రూ.50/-
78) బుద్ధి వికసించిన వారి ప్రవర్తన - రూ.50/-
79) ఈ జీవితం ఎందుకు? - రూ.40/-
80) భార్యభర్తలు గొడవ పడకూడదంటే - రూ.40/-
81) విదురుని సందేశాలు - రూ.40/-
82) మూడురకాల జీవితాలు - రూ.40/-
83) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే - రూ.40/-
84) ఛాంపియన్ అవ్వాలంటే? - రూ.40/-
85) బ్రహ్మం అంటే? - రూ.40/-
86) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం - రూ.40/-
87) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం - రూ.40/-
88) మహాత్ముల సందేశాలు - రూ.40/-
89) సత్యం - రూ.40/-
90) చక్రాలు - రూ.40/-
91) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
92) భాగవత సన్నివేశాల అంతరార్థం - రూ.40/-
93) మౌన ధ్యానం - రూ.40/-
94 )మనంఇహలోకవాసులమా? పరలోకవాసులమా? - రూ.20/-
95) శాకాహారమే మానవాహారం - రూ.15/-
96) అహింస మరియు శాఖాహారం - రూ.15/-



"ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు" అనే వాక్యానికి అర్థం ఏమిటంటే ప్రస్తుతం మీ జీవితంలో జరుగుతున్న అనుభవాలకు కారణం మీరే. గతంలో మీరు చేసిన కర్మలే, ఇప్పుడు మీ వాస్తవంగా మీ ముందుకు వచ్చాయి, ఈ అవగాహన వచ్చినప్పుడు ఇతరులను నిందించడం తగ్గుతుంది. "నేను చేసిన కర్మల ఫలితాన్నే ఇప్పుడు అనుభవిస్తున్నాను" అనే స్పష్టతతో ఉంటారు. ఓర్పుతో పరిస్థితులను ఎదుర్కొంటారు, ఆ కర్మ ఫలం పూర్తయిన తర్వాత ఆ కష్టం నుంచి బయటపడతారు. ఇతరులను తప్పుపట్టడంలో సమయం వృథా చేయరు. బదులుగా ధ్యాన మార్గాన్ని ఆశ్రయించి, మరింత తీవ్రంగా సాధన చేస్తారు. ఎందుకంటే ధ్యానం ద్వారా అపారమైన శక్తిని సంపాదించవచ్చని వారికి తెలుసు. ఇన్నేసి గంటలపాటు క్రమశిక్షణతో, శ్రద్ధతో ధ్యానం చేస్తున్నారు. మీరు అమూల్యమైన శక్తిని సంపాదిస్తున్నారు. మీ శరీరాన్ని, మనస్సును శక్తివంతంగా తీర్చి దిద్దుకుంటున్నారు. "శక్తి పెరిగితే ప్రయోజనం ఏమిటి?". శక్తి ఉన్నవాడు ఎంతటి కష్టాన్నైనా తట్టుకోగలడు. కష్ట కాలంలో నిలబడగలడు, ఓర్పుతో కర్మ ఫలాన్ని అనుభవిస్తూ చివరకు ఆ పరిస్థితి నుంచి బయటపడగలడు.

- బ్రహ్మర్షి తటవర్తి వీర రాఘవరావు

రూ. 70/-

**తటవర్తి వీరరాఘవరావు, రాజ్యలక్ష్మి గార్ల పుస్తకములు**

**వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకొనుటకు**

**ఈ QR codesను google lens లో స్కాన్ చేయండి.**

| Telugu Books | English Books | Hindi Books | Kannada Books | Tamil Books |
|---|---|---|---|---|